www.mudranews.in

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

హైదరాబాద్
మంగళవారం, 25.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 295
పేజీలు: 08 వెల: రూ. 5


**92.87** లక్షల మంది ఓటర్లకు

# నోటీసులు

## నేటి నుంచే జారీకి సన్నాహాలు

- 60.51 లక్షల ఓటర్లకు అనామలీస్ నోటీసులు
- 32.36 లక్షల ఓటర్లు అన్-మ్యాపింగ్‌లో
- ఇంటింటికీ వెళ్లి నోటీసులు ఇవ్వనున్న బీఎల్‌వోలు
- ఆన్‌లైన్‌లోనూ నోటీసు వివరాల చెక్
- ఓటర్లకు రోజుకు మూడు స్లాట్ల కేటాయింపు



**ముద్ర డెస్క్ :**
ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా తెలంగాణలోని 92.87 లక్షల మంది ఓటర్లకు నేటి నుంచి దశలవారీగా నోటీసులు అందించనున్నారు. వీరిలో 60.51 లక్షలు అనామలీస్, 32.36 లక్షలు అన్-మ్యాపింగ్ కేటగిరీల్లో ఉన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందించి, వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. నిర్ణీత తేదీ, సమయంలో ఓటర్లు ఈఆర్వో, ఏఈఆర్వో ఎదుట ధ్రువపత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటు తొలగదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.
ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా అనామలీస్, అన్-మ్యాపింగ్ విభాగాల్లో ఉన్న ఓటర్లకు నేటి నుంచి దశలవారీగా నోటీసులు జారీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 92.87 లక్షల మంది ఓటర్లు నోటీసులు అందుకోనున్నారు. వీరిలో 60.51 లక్షల మంది అనామలీస్ కేటగిరీలో, మరో మిగతా 02లో

## పిల్లలు ఆకలితో ఉండొద్దు

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకం
- సుమారు రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు
- గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం
- మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన మంత్రి

03




## భారత్‌కు చైనా అధ్యక్షుడు

సెప్టెంబర్‌లో ఢిల్లీలో బిక్స్ శిఖరాగ్ర సమావేశాలు

- భారీ బృందంతో ఢిల్లీకి వస్తున్న చైనా అధ్యక్షుడు
- బ్రిక్స్‌లో పాల్గొననున్న జిన్‌పింగ్

02



## బీజేపీ పోరుబాట

రీయింబర్స్‌మెంట్ పై రాంచందర్ రావు రెండు రోజుల దీక్ష

- విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలని డిమాండ్
- నాంపల్లిలోని పార్టీ ఆఫీసులో నిరసన దీక్ష
- సపోర్టుగా తరలివచ్చిన విద్యార్థులు

02



## సారంపల్లి మరణం తీరని లోటు

ప్రజా పోరాట యోధుడు మల్లారెడ్డి

04

- రైతు సమస్యలపై అలుపెరగని పోరు
- మల్లారెడ్డికి నేతల ఘన నివాళి
- సంతాప సభలో నాగయ్య, సాగర్



## రాష్ట్ర అభివృద్ధిని

# అడ్డుకుంటారా?

### సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

## గుజరాత్‌కు ఓకే.. తెలంగాణకు నో?

- అమెరికా టూర్‌కు కేంద్రం బ్రేక్!
- కేంద్రంపై తిరుగుబాటు స్వరం!
- నన్ను ఆపగలిగారు.. తెలంగాణను ఆపలేరు!
- విదేశాంగ శాఖ తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం!
- రేవంత్ టూర్‌కు నో.. తెలంగాణ రాజకీయాల్లో హీట్!





**ముద్ర , హైదరాబాద్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడంపై రాజకీయ దుమారం రేగుతోంది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాల కోసం తాను చేపట్టిన విదేశీ పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రయోజనాలను అడ్డుకోవడమేనని సీఎం తీవ్రంగా స్పందించారు.
లండన్ పర్యటన అనంతరం అమెరికా వెళ్లాల్సి ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో రేవంత్ రెడ్డి అక్కడి నుంచే హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అయితే తన విదేశీ పర్యటనకు సంబంధించి ఎలాంటి రహస్యం లేదని, ముందుగానే కేంద్ర విదేశాంగ శాఖకు లేఖ ద్వారా సమాచారం ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు.

**గుజరాత్‌కు ఓకే.. తెలంగాణకు నో?**
తన పర్యటనను అడ్డుకోవడంపై రేవంత్ రెడ్డి కేంద్రంపై నేరుగా ప్రశ్నలు సంధించారు. గుజరాత్ ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చి, తెలంగాణ ముఖ్యమంత్రికి ఎందుకు నిరాకరించారని నిలదీశారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాష్ట్ర అభివృద్ధి అవకాశాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

**మోదీకి గౌరవం.. కేంద్రంతో సహకారం**
ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి హోదాలో స్వాగతం పలికానని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, అధికారుల కేటాయింపులపై చర్చించానని చెప్పారు. కేంద్రంతో సహకరిస్తూనే తెలంగాణ మిగతా 02లో



## రేవంత్‌తో భట్టి

# అత్యవసర భేటీ

### కొండా సురేఖ వ్యాఖ్యలపై చర్చ

- వివాదాల ప్రభావంపై నేతల సమీక్ష
- తదుపరి చర్యలపై సమాలోచనలు
- పాలన, శాఖల పనితీరుపైనా చర్చ



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అత్యవసరం గా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలతో పాటు మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.
కొన్ని రోజులుగా వివాదాస్పద అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ వ్యవహారాలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠపై చూపుతున్న ప్రభావంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.
కొండా సురేఖ అంశంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎలా ముగింపు పలకాలి? పార్టీపై ప్రభావం పడకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలనాపరమైన అంశాలు, వివిధ శాఖల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. భేటీకి ప్రాధాన్యం ఏర్పడటంతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సమావేశం తర్వాత ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్న దానిపై ఆసక్తి ఉంది.



## 22ఏ భూములపై

# భయపడొద్దు

### ఈ భూముల సమస్యలకు 24 గంటల్లో పరిష్కారం

02

- ప్రజలు కంగారు పడొద్దు.. న్యాయం చేస్తాం
- 22ఏ భూములపై టోల్‌ఫ్రీకి 1162 కాల్స్: మంత్రి పొంగులేటి



### ప్రపంచ మార్కెట్లకు

# ఏపీ ఉత్పత్తులు

పంటలకు విలువ జోడిద్దాం: సీఎం చంద్రబాబు

- ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, బ్రాండ్లుగా మారాలి
- పంటలకు విలువ.. రైతులకు అధిక ఆదాయం
- రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

02

## కొండా ఎపిసోడ్‌పై

# రేవంత్ క్లారిటీ

### క్రమశిక్షణా కమిటీ పరిశీలనలో అంశం

- పార్టీ అంతర్గత విషయాలపై మాట్లాడను
- హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

02



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం, 25.08.2026
www.mudranews.in | @mudranews



## కరివేపాకు.. జుట్టు బలానికి



కరివేపాకులో యాంటీఆక్సిడెంట్లు, కొన్ని పోషకాలు ఉంటాయి. వీటిని నూనెలో కలిపి వాడటం వల్ల జుట్టు పొడిబారకుండా, స్కాల్ప్ కండిషన్ మెరుగ్గా ఉండేందుకు సహాయపడొచ్చు.

### కొండా సురేఖ ఎపిసోడ్‌పై
# రేవంత్ క్లారిటీ



**ముద్ర, హైదరాబాద్:** లండన్ పర్యటనపై సీఎం రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. అనంతరం ఇటీవల మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించింది. అయితే.. కొండా సురేఖ , ఆమె కుమార్తె ఇటీవలి వ్యాఖ్యల వ్యవహారంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈ అంశం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ పరిశీలనలో ఉందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అంతర్గత వ్యవహారాల గురించి బహిరంగంగా మాట్లాడనని స్పష్టం చేశారు. పార్టీలో క్రమశిక్షణ అత్యంత కీలకమని, క్రమశిక్షణా కమిటీ దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. హైకమాండ్ , పార్టీ తీసుకునే ఏ నిర్ణయానికైనా నాయకులంతా క్రమశిక్షణతో కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్ సూచించారు.

### ప్రపంచ మార్కెట్లకు
# ఏపీ ఉత్పత్తులు

**ముద్ర, నూజివీడు:** రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం కల్పించడంతో పాటు సంపద సృష్టించవచ్చని సీఎం చంద్రబాబు అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్‌కార్న్ సంస్థకు చెందిన నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి సీఎం ఆవిష్కరించారు. 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్నారని, దేశంలో పాప్‌కార్న్ ఉత్పత్తిలో గార్మె సంస్థకు 70 శాతం వాటా ఉందని చంద్రబాబు తెలిపారు. నూజివీడు పాప్‌కార్న్‌ను ఆసియా మాత్రమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేయాలని ఆకాంక్షించారు. రైల్వే స్టేషన్లలో ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ విక్రయించే కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొండపల్లి బొమ్మలు వంటి స్వదేశీ ఉత్పత్తులు కూడా గ్లోబల్ మార్కెట్లకు చేరాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ అవుతున్నాయని, దీనిని పెంచితే రైతులకు మరింత ఆదాయం వస్తుందని సీఎం చెప్పారు. యువత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పసుపు, మిరప, మొక్కజొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులకు విలువ జోడించి అంతర్జాతీయ బ్రాండ్లుగా అభివృద్ధి చేయాలని సూచించారు.

రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని, రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. నీటి భద్రత కోసం గోదావరి-కృష్ణా, తుంగభద్ర-పెన్నా-కావేరీ నదుల అనుసంధానంతో పాటు దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.




# భారత్ కు చైనా అధ్యక్షుడు

**ముద్ర, ఢిల్లీ :** సెప్టెంబర్‌లో ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు సభ్య దేశాలను భారత్ ఆహ్వానించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ రాబోతున్నారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వస్తున్నారా లేదా అన్నది ఇప్పటి దాకా తేలలేదు. తాజాగా భారీ బృందంతో భారత్‌కు వస్తున్నట్లుగా రాయిటర్స్ తెలిపింది. డోక్లాం ఘర్షణ తర్వాత.. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాబోతున్నారు. దీంతో బ్రిక్స్ సమావేశాలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి.



బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నాయి. జిన్‌పింగ్ వచ్చే నెలలో బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పర్యటన ముఖ్యమైనదని.. భారత్-చైనా మధ్య మెరుగుపడుతున్న సంబంధాలకు సంకేతమని రాయిటర్స్ పేర్కొంది. జిన్‌పింగ్ హాజరు ఎంత ముఖ్యమైనదంటే.. బ్రిక్స్ సదస్సు కంటే ఆయన గురించే ఎక్కువగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరు దేశాలు ఇటీవల కొన్ని చర్చలు జరిపాయి. ఈ సమయంలో అజిత్ దోవల్ కూడా చైనాలోనే ఉన్నారు. పలు ముఖ్యమైన చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరుబాట..

**ముద్ర, హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. 'మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి' అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని.. దీనికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని.. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ తెలిపారు. "యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై లాఠీచార్జ్ చేయించి, పోలీసులతో దురుసుగా వ్యవహరింపజేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి నిరసనలో నేను స్వయంగా పాల్గొన్నాను. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు? స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదు? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మా పోరాటం ఆగదు. ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి!" అంటూ వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాల కోసం ప్రశ్నించడం తన విధానమని స్పష్టం చేశారు.




**ఆక్స్‌ఫర్డ్‌తో కీలక ఒప్పందం**

తన పర్యటనను అడ్డుకున్నప్పటికీ తెలంగాణ అధికారుల కార్యక్రమాలు ఆగలేదని సీఎం తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్యలు కొనసాగాయని చెప్పారు. తనను వ్యక్తిగతంగా ఆపగలిగినా తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను అడ్డుకోలేకపోయారని వ్యాఖ్యానించారు.

**జాతీయ మీడియా కథనాలపై అభ్యంతరం**

రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై కొన్ని జాతీయ మీడియా సంస్థలు చేసిన కథనాలపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ వ్యతిరేక శక్తులతో ఆయన భేటీ అయ్యారంటూ వచ్చిన ప్రచారంపై పూర్తి వివరాలను క్రాస్‌చెక్ చేయకుండా వార్తలు ప్రచురించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ కథనాల ఆధారంగా తెలంగాణలో రాజకీయ విమర్శలు మరింత ముదిరాయి.

**పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం**

తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్రం వ్యవహరించిన తీరుపై పూర్తి ఆధారాలతో మాట్లాడతామని స్పష్టం చేశారు.

ఇది కేవలం రేవంత్ రెడ్డి వ్యక్తిగత పర్యటనకు సంబంధించిన అంశం కాదని.. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు, అంతర్జాతీయ అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయమని ఆయన వాదన. దీంతో కేంద్రం-తెలంగాణ మధ్య రాజకీయ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆరోపణలకు బీజేపీ నేతలు ఏ విధంగా సమాధానం ఇస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# 22ఏ భూములపై భయపడొద్దు



**ముద్ర, హైదరాబాద్:** 22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. వారికి న్యాయం చేస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా అధికారులతో దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. రిలాక్సేషన్ వచ్చిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్‌లోని భూదాన్ భూముల్లోని వాటిని తిరస్కరించాం. 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన కాల్స్‌ను జిల్లాల వారీగా పంపించాం. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశాం. ఎక్కడైనా ఒకట్రెండు ఆగిపోతే పరిష్కరిస్తాం.. ఆందోళన అవసరం లేదు'' అని పొంగులేటి తెలిపారు.

### 92.87 లక్షల మంది
# ఓటర్లకు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

32.36 లక్షల మంది అన్-మ్యాపింగ్ కేటగిరీలో ఉన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి, అర్హులైన వారిని తుది జాబితాలో కొనసాగించనున్నారు. ఈ నెల 17న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసినప్పటికీ, మరుసటి రోజు నుంచి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా కొన్ని పరిపాలనా కారణాలతో ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్నికల యంత్రాంగం నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందించనున్నారు.

నోటీసు ఇచ్చే సమయంలో సంబంధిత ఓటరు ఫొటోను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నోటీసు స్లిప్‌లో జారీ చేసిన తేదీ, హాజరు కావాల్సిన సమయం, నోటీసు జారీకి కారణం వంటి వివరాలను పొందుపరుస్తారు. రోజుకు మూడు స్లాట్లను ఏర్పాటు చేసి, ఏ స్లాట్‌లో ఓటరు ఈఆర్వో లేదా ఏఈఆర్వో ఎదుట హాజరు కావాలో ముందుగానే తెలియజేస్తారు. కేటాయించిన రోజున హాజరు కాలేని వారు ఆ తర్వాత ఎన్నికల అధికారులను సంప్రదించి కారణాన్ని వివరిస్తే మరో తేదీకి నోటీసును జనరేట్ చేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే కొత్త తేదీన తప్పనిసరిగా హాజరై, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో రోజుకు సుమారు 200 మంది వరకు హాజరయ్యేలా స్లాట్లను రూపొందిస్తున్నారు.

గ్రామీణ జిల్లాల్లో ఇప్పటికే ఈఆర్వోలు, ఏఈఆర్వోలను నియమించగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నోటీసులు అందుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో అదనపు ఏఈఆర్వోలను నియమిస్తున్నారు. వీఐపీలు, ఎన్ఆర్ఐలు, సెలబ్రిటీలకు నోటీసులు వస్తే వారు నేరుగా ఈఆర్వో ఎదుట హాజరు కాకుండానే ప్రత్యామ్నాయ విధానాల్లో ధ్రువపత్రాలను సమర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నోటీసు అందినంత మాత్రాన ఓటు తొలగిపోతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్ణయించిన తేదీ, సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై వివరాలను నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు. అర్హులైన ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని భరోసా ఇస్తున్నారు. అందుబాటులో ఉన్న ధ్రువపత్రాలతో పరిశీలించి పరిష్కరించాలని ఈఆర్వోలకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం.



**ఆన్‌లైన్‌లోనూ నోటీసు వివరాలు**

సర్ ముసాయిదా జాబితాలో తమ పేరు ఉన్న ఓటర్లు నోటీసు జాబితాలో ఉన్నారో లేదో ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో 'Submit Document Against Notice Issued' ఆప్షన్‌ను ఎంచుకుని ఫోన్ నంబర్ లేదా ఎపిక్ నంబర్‌తో ఓటీపీ ద్వారా వివరాలను పరిశీలించవచ్చు. నోటీసు జనరేట్ అయి ఉంటే ఓటరు పేరు, ఎపిక్ నంబర్, నియోజకవర్గం, రాష్ట్రం, సమాధానం ఇవ్వాల్సిన తేదీ, పోలింగ్ బూత్ వివరాలు కనిపిస్తాయి. నోటీసులు దశలవారీగా జనరేట్ అవుతున్నందున పేరు కనిపించకపోతే మరో రోజు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా తెలంగాణలో 92.87 లక్షల మంది ఓటర్లకు సోమవారం నుంచి దశలవారీగా నోటీసులు అందించనున్నారు. వీరిలో 60.51 లక్షలు అనామలీస్, 32.36 లక్షలు అన్-మ్యాపింగ్ కేటగిరీలో ఉన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందించి, వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. నిర్ణీత తేదీ, సమయంలో ఓటర్లు ఈఆర్వో, ఏఈఆర్వో ఎదుట ధ్రువపత్రాలతో హాజరు కావాలి. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటు తొలగదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ నోటీసు వివరాలను ఓటర్లు తెలుసుకోవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



### జుట్టుకు ఇంటిచిట్కాలు వాడేటప్పుడు జాగ్రత్త

ఇది అందరికీ ఒకేలా పనిచేయదు. ముందుగా కొద్దిగా చర్మంపై పరీక్షించి, దురద లేదా మంట వస్తే వాడకండి. అధికంగా జుట్టు రాలుతుంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



# పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు

**- పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
**- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**- పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకం**
**- సుమారు రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు**
**- గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం**
**- మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన మంత్రి**





**ముద్ర, మంథని :** పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి, వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్‌లో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. దీంతో అక్కడ విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగింద న్నారు. ప్రస్తుతం కొడంగల్‌తో పాటు మధిరలోనూ ఈ పథకం అమలవుతోందని చెప్పారు.మంథని కిచెన్‌లో గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల అల్పాహారం అందించేలా ప్రత్యేక మెనూ రూపొందించామని, వారానికి కనీసం మూడు సార్లు పాలు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధ్యయనాల ప్రకారం విద్యాశాఖ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. అల్పాహార పథకంతో విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మపురి అరవింద్ కదలికలపై నిఘా ఆరోపణలు

**ముద్ర, హైదరాబాద్ :** బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తన కదలికలపై తెలంగాణ పోలీసుల నిఘా ఉందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు ఏసీపీ స్థాయి అధికారి తనను, తన కదలికలను పర్యవేక్షిస్తున్నారని ఇటీవల తెలిసిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయాన్ని డీజీపీ సీవీ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లిన అరవింద్.. తెలంగాణ పోలీసులు రాజ్యాంగం, చట్టబద్ధమైన అధికార వ్యవస్థ ప్రకారం పనిచేస్తున్నారా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నారా? అని ప్రశ్నించారు. పోలీసులు చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఈ ఆరోపణలపై పోలీసు శాఖ లేదా ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

## కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు భూముల వేలాన్ని రద్దు చేయాలి

**- ఈటల రాజేందర్**

**ముద్ర, హైదరాబాద్ :** కూకట్పల్లి హౌసింగ్ బోర్డులో భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కూకట్పల్లిలో స్థానిక నాయకులతో కలిసి వేలానికి ఉంచిన ప్లాట్లను పరిశీలించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు.

హౌసింగ్ బోర్డు పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఏర్పాటు చేసిందే తప్ప, ప్రభుత్వ భూములను విక్రయించి వ్యాపారం చేసేందుకు కాదని ఈటల అన్నారు. కూకట్పల్లి ప్రాంతంలో ఇప్పటికే జనసాంద్రత పెరిగిపోయిందని, ఖాళీ స్థలాలను పాఠశాలలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు తదితర ప్రజా అవసరాలకు కేటాయించాలని సూచించారు. రెండో తేదీన నిర్వహించనున్న వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూములు అమ్ముకుని పాలన సాగిస్తోందని విమర్శించిన ఈటల.. భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లమ్మబండ, షంషీగూడ భూముల విషయంలోనూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గతంలో అక్రమ కేటాయింపులపై విచారణ చేస్తామని చెప్పిన సీఎం.. హానర్ హోమ్స్‌కు సంబంధించిన భూముల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.



22ఏ భూముల వ్యవహారంలో భారీ మొత్తంలో ఆదాయం సమకూర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈటల ఆరోపించారు. పేదల భూములు, ప్రభుత్వ స్థలాలను కాపాడటంతో పాటు పేదలకు వారి నివాస ప్రాంతాల్లోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భూముల విక్రయాలను ప్రభుత్వం కొనసాగిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్ రావు, మహేందర్, ప్రీతంరెడ్డి, బలవంత్ రెడ్డి, సుధం, వరలక్ష్మి , వినోద్, ఐలయ్య, సత్యనారాయణ, ఎంఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 'ఒంటరి సమరం'... జనసేన ఆశలు, జనసైనికుల కలలు ఏంటి?





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన మలుపు! నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అభ్యర్థిని దించడం ద్వారా జనసేన పార్టీ తెలంగాణలో తన రాజకీయ అడుగులను వేగవంతం చేస్తోంది. కేవలం ఎమ్మెల్సీ స్థానమే కాకుండా, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఖమ్మం లో జరిగిన జనసేన సమావేశంలో ఈ ప్రకటన చేయటంతో పాటు సెప్టెంబర్ 13 న ఖమ్మం నుండి ఎన్నికల శంఖారావం పూరించనట్టు నాయకులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయోత్సాహంతో, తెలంగాణ గ్రౌండ్ లెవెల్‌లో కూడా తమ ముద్ర వేసేందుకు పార్టీ వ్యూహాత్మకంగాఅడుగులేస్తోంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అధికారిక కూటమిలో పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన క్రియాశీలక భాగస్వామిగా కొనసాగుతుండగా, తెలంగాణలో మాత్రం పార్టీ రాజకీయం భిన్నమైన మలుపు తిరుగుతోంది. ఏపీలో టీడీపీ, బీజేపీతో జట్టుకట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనుభవం ఉన్నప్పటికీ, తెలంగాణలో మాత్రం ప్రస్తుతానికి ఒంటరిగానే బరిలోకి దిగుతామని అధినేత పవన్ కళ్యాణ్ చేసిన స్పష్టమైన సంకేతాలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి.

**'ఒంటరి' బాట వెనుక పొలిటికల్ వ్యూహం**

తెలంగాణ రాజకీయాలు అత్యంత సంక్లిష్టమైనవి. పొత్తులప్రతిపాదనలు తెలంగాణ సెంటిమెంట్ తీవ్ర ప్రభావం చూపింది. తెలంగాణ రాజకీయం పొత్తుల విషయంలో ఎప్పుడూ అత్యంత సున్నితమైనది, ప్రాముఖ్యమైనది. గత అనుభవాలను పరిశీలిస్తే, పొత్తులు పార్టీల గెలుపోటములపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని విశ్లేషకులు చెబుతుంటారు. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కుదుర్చుకున్న పొత్తు వికటించి, తెలంగాణ సెంటిమెంట్ మళ్లీ వ్యూహాత్మకంగా బలంగా మారడంతో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుందనే అభిప్రాయం ఉంది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా పూర్తిగా పోటీకి దూరంగా ఉండటంతో, ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు బదిలీ అయి ఆ పార్టీకి బాగా కలిసి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కారణాల వల్లే ప్రస్తుతం తెలంగాణలోని ప్రధాన పార్టీలన్నీ పొత్తుల విషయంలో అత్యంత ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తమ సొంత బలంతోనే రాష్ట్రంలో పాతుకుపోవాలనేది పవన్ కళ్యాణ్ ఆలోచనగా కనిపిస్తోంది. ఏపీలో పొత్తులో భాగమైనా, తెలంగాణలో కూటమి సమీకరణాలు వేరుగా ఉంటాయి. ఇక్కడ బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు తెలుగుదేశం పార్టీ విస్తరణ కూడా ఒడిదుడుకులతో సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తమ పార్టీ స్వయం సమృద్ధి సాధించాలంటే పొత్తులపై కాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీకి కేడర్ నిర్మించుకోవడమే సరైన మార్గమని జనసేన భావిస్తోంది.

**పొత్తుపై 'జనసైనికుల' గణింపులు**

పార్టీ అధిష్టానం ప్రస్తుతానికి ఒంటరి పోరుపై స్పష్టతనిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలోని జనసైనికులు, పార్టీ శ్రేణులు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారనే చర్చ నడుస్తోంది. ఏపీలో వర్కవుట్ అయిన "టిడిపి – బిజెపి – జనసేన" త్రిముఖ కూటమి సమీకరణం తెలంగాణలోనూ ఏదో ఒక దశలో కలసివస్తుందని వారు బలమైన ఆశతో ఉన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లో సెటిలర్లు, అర్బన్ ఓటర్లు అధికంగా ఉంటారు. ఏపీ కూటమిలోని పార్టీలన్నీ తెలంగాణలో తమకు అనుకూలంగా మారితే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓట్లను చీల్చడం సులువవుతుందని కార్యకర్తల భావన.

జీహెచ్ఎంసీ, ఖమ్మం, వరంగల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ క్షేత్రస్థాయిలో కూడా అదే పరిస్థితి కొనసాగితే తమకు మరితగా కలిసివస్తుందని జనసేననేతలు విశ్లేషిస్తున్నారు.

**బిసి కార్డ్ + 'సనాతన' సిద్ధాంతంతో కొత్త దారి**

పొత్తుల సంగతి పక్కన పెడితే, జనసేన ప్రస్తుతం తన సొంత సిద్ధాంతాల ప్రాతిపదికన ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలో అత్యధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు రాబోయే స్థానిక ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తోంది. అదే సమయంలో 'సనాతన ధర్మం', ధార్మిక ఆలోచనలతో భావజాలపరంగా ఇక్కడి అర్బన్ యువతకు చేరువ కావడానికి వ్యూహాలు రచిస్తోంది. అంతేకాకుండా, గ్రాడ్యుయేట్ స్థానాల్లో పోటీ చేయడం ద్వారా విద్యావంతులను పార్టీ శ్రేణుల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే, బీఆర్ఎస్, బీజేపీలు గట్టి ప్రతిపక్షాలుగా పోరాడుతున్నాయి. ఈ ముక్కోణపు పోటీ మధ్య జనసేన తన ఉనికిని చాటుకోవడం అంత తేలికైన విషయం కాదు. పవన్ కళ్యాణ్ ఇమేజ్, అర్బన్ యువతలోని క్రేజ్ పార్టీకి ప్లస్ పాయింట్ అయినా, నియోజకవర్గ స్థాయిలో బలమైన క్యాడర్ లేకపోవడం ప్రతిబంధకంగా మారవచ్చు.

తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు పవన్ కళ్యాణ్ మణికొండలో నూతన కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చి ముందుకు సాగుతుండటంతో, ఆయన స్పష్టమైన కార్యాచరణను ప్రకటించారు. అయినప్పటికీ, ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పొత్తుల సమీకరణాలు మారుతాయా లేక తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాత్మకంగా జనసేన 'సింగిల్ రైడ్' చేస్తుందా అనేది వేచి చూడాల్సిందే!

## జర్నలిస్ట్ ఇబ్రహీం కుటుంబానికి అండగా టీయూడబ్ల్యూజే



**యాదాద్రి భువనగిరి జిల్లా:** రామన్నపేట మండల సీనియర్ జర్నలిస్టు MD ఇబ్రహీం గారు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. సోమవారం రామన్నపేట మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో ఇబ్రహీం గారి సంతాప సభను నిర్వహించారు. హజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ వెలిమినేటి. జహంగీర్ మాట్లాడుతూ ఇబ్రహీం గారి అకాల మృతి యూనియన్ కు, పత్రికారంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. యూనియన్ కు ఆయన అందించిన సేవలను విస్మరించలేమన్నారు. జర్నలిజంలో నైతిక విలువలు పడిపోతున్నాయని తీవ్ర ఆందోళన చెందేవాడని అన్నారు. ఐదు దశాబ్దాల కాలం పాటు ఒకే సంస్థలో కొనసాగిన ఘనత ఇబ్రహీం గారికి దక్కింది అన్నారు. టి యు డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సూచన మేరకు ఇబ్రహీం గారి కుటుంబానికి మీడియా అకాడమీ నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని, వారి సతీమణికి నెలకు 3000 చొప్పున ఐదేళ్లపాటు పెన్షన్ ఇప్పియ్యడానికి యూనియన్ ప్రక్షాళ హామీని ఇస్తున్నట్లు సంతాప సభలో జిల్లా యూనియన్ పక్షాన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కే శశిధర్ రెడ్డి, జిల్లా నాయకులు ఎండీ కుర్షిత్ పాషా, స్థానిక పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## బిచ్చమెత్తి 30 బస్తాల డబ్బు కూడబెట్టింది..

**అనుభవించకుండానే కన్నుమూసింది**
**బిచ్చమెత్తి రూ.8.40 లక్షలు బస్తాల్లో దాచిన వృద్ధురాలు!**
**చనిపోయాక బయటపడ్డ లక్షల రహస్యం!**

**ముద్ర డెస్క్ :** కర్ణాటక లో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. జీవితమంతా భిక్షాటన చేస్తూ గడిపిన ఓ 68 ఏళ్ల మహిళ ఇంట్లో రూ.8.40 లక్షల నగదు బయటపడింది. ఆమె మొత్తం 30 కి పైగా బస్తాల్లో నోట్ల ను, నాణేల ను దాచిపెట్టింది. అయితే ఆ డబ్బును ఆమె ఉపయోగించుకోకుండానే కన్నుమూసింది. మాండ్య లో ఇటీవల ఈ ఘటన వెలుగుచూసింది.మాండ్యకు చెందిన హూర్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. ఆమె మరణించిన తర్వాత స్థానికులు ఆమె ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తాల్లో పెద్ద మొత్తంలో నగదు కనిపించింది. రూ.10, రూ.20, రూ.50 నోట్లు భారీగా ఉన్నాయి. వేల సంఖ్యలో నాణేలు కూడా బయటపడ్డాయి. హూర్ తన సోదరితో కలిసి అద్దె ఇంట్లో ఉండేవారు. ఆమె సోదరి రెండేళ్ల క్రితమే చనిపోయారు. ఇద్దరికీ వివాహం కాలేదు. హూర్ జీవితమంతా భిక్షాటన చేస్తూ వచ్చినట్లు స్థానికులు తెలిపారు. బస్తాల్లో ఉన్న నగదును స్థానికులు బయటకు తీసి లెక్కించారు. మొత్తం రూ.8.40 లక్షలు ఉన్నట్లు తేలింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఆమె ఇంట్లో దొరికిన నగదును హూర్ సోదరులకు అప్పగించారు. ఒక సోదరుడు రూ.6 లక్షలు తీసుకోగా.. మరో సోదరుడికి రూ.2.40 లక్షలు దక్కాయి. ఆ మొత్తాన్ని ఆయన మసీదుకు విరాళంగా ఇచ్చారు.

## హైదరాబాద్‌ను ఏఐ ఆధారిత ప్రొఫెషనల్ సేవల హబ్‌గా తీర్చిదిద్దుతాం

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ ను టెక్నాలజీ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు అంతర్జాతీయ హబ్ గా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏఐ వినియోగం అన్ని వృత్తిపరమైన రంగాల్లో వేగంగా విస్తరిస్తోందని, సాంకేతికతను బాధ్యతాయుతంగా, నైతికంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన టెక్నాలజీ వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అంతర్జాతీయ అనుసంధానం హైదరాబాద్ కు ఉన్నాయని పేర్కొన్నారు. కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్ హైదరాబాద్ కేంద్రం ద్వారా భారత్ తో పాటు అమెరికా, బ్రిటన్, యూఏఈ తదితర దేశాల్లోని న్యాయ నిపుణులను క్లయింట్లకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఏఐను న్యాయవాదులకు ప్రత్యామ్నాయంగా కాకుండా సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తామని సంస్థ స్పష్టం చేసింది. అర్హత కలిగిన న్యాయ నిపుణులే న్యాయ సలహాలు, ప్రాతినిధ్య సేవలు అందిస్తారని తెలిపింది. ఇలాంటి కార్యక్రమాలు హైదరాబాద్ ను అంతర్జాతీయ ప్రొఫెషనల్, జ్ఞానాధారిత సేవలకు కీలక గమ్యస్థానంగా మార్చేందుకు దోహదపడతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## మైనారిటీ, ఎస్సీ సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం




**ముద్ర, హైదరాబాద్:** శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం సోమవారం జరిగింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించి, సంక్షేమ పథకాలు అర్హులకు సమర్థవంతంగా చేరేలా చేయడంలో శాసనసభ కమిటీల పాత్ర కీలకమన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమంపై సమగ్రంగా పర్యవేక్షించాలని సూచించారు. ఎస్సీల సంక్షేమ పథకాల అమలులో లోటుపాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి సూచనలు చేయాలని తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ గంగా–జమున తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న ఎస్సీల అభ్యున్నతికి కమిటీ కృషి చేయాలని సూచించారు. కమిటీ సభ్యులు అధికారులతో సమన్వయంతో పనిచేసి మైనారిటీలు, ఎస్సీల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 25.08.2026
4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేదిక

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# దేవుడికి కల్తీ ఆయిల్..!

ప్రస్తుతం శ్రావణమాసం. ప్రతి ఇళ్లల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది. ఉదయం లేవగానే సుప్రభాత పాటలు.. ధూప, దీపాలు.. అగర్బత్తుల సువాసనలతో ఇల్లు దేవాలయంగా మారుతుంది. అయితే ప్రతి పూజలో దీపం ఖచ్చితంగా ఉంటుంది. కానీ ఈ దీపానికి వెలిగించే నూనె ఎటువంటిదో చాలామంది పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే ఈ నూనె తయారీలో ఎంతో మోసం ఉంటుందని కొన్ని వీడియోల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఈ నూనె తయారీలో ఎలాంటి స్వచ్ఛత లేకుండా.. పాడైపోయిన నూనెను సరఫరా చేస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. అదెలా జరుగుతుందంటే?




ఇటీవల కొన్ని వీడియోల ద్వారా.. కొందరు ప్రముఖులు తెలుపుతున్న ప్రకారం.. హోటల్స్, ఇతర ప్రదేశాల్లో ఉపయోగించి పక్కకు పెట్టే నూనె తిరిగి పూజ ఆయిల్ అని విక్రయిస్తున్నట్లు కొందరు తెలుపుతున్నారు. పాడైపోయిన నూనెను తిరిగి చిన్న చిన్న బాటిల్స్ లో ఉంచి వాటిపై దేవుడికి సంబంధించిన స్టిక్కర్ వేసి మార్కెట్లోకి తీసుకు వస్తున్నట్లు అంటున్నారు. అయితే వీటిని తక్కువ ధరకే విక్రయించడంతో చాలా మంది రెడీమేడ్ గా దొరికే నూనె అని భావించి పూజ కోసం తీసుకెళ్తున్నారు. కానీ ఇవి పూర్తిగా కల్తీ మయంగా మారుతుందని ఆరోపిస్తున్నారు.

వాస్తవానికి దేవుడి దగ్గర దీపం వెలిగించేవారు స్వచ్ఛమైన మనసుతో.. స్వచ్ఛమైన పదార్థాలను ఉపయోగించాలి. ఇందులో నూనె విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పూర్వకాలంలో ఆవు నెయ్యితో దీపం వెలిగించేవారు. ఈ నెయ్యిని ఉపయోగించడం వల్ల ఆ ఇంట్లో పాజిటివ్ వాతావరణం ఎలా ఉంటుంది. అంతేకాకుండా సువాసనలను వెదజల్లుతుంది. అందువల్ల దేవుడికి దీపం వెలిగించే విషయంలో ఎటువంటి నూనెను వాడుతున్నాం అనే విషయాన్ని గ్రహించుకోవాలి.

అంతేకాకుండా న్యాచురల్ గా దొరికే ఆయిల్ ను మాత్రమే తీసుకురావాలి. రెడీమేడ్ గా దొరికే ఈ పూజ ఆయిల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని కొందరు సూచిస్తున్నారు. ఎందుకంటే ఈ నూనె ను ఉపయోగించడం వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. అయితే ఎక్కువ శాతం దీపం వెలిగించేవారు ఆవు నెయ్యిని ఉపయోగించాలని ఆధ్యాత్మికవాదులు సూచిస్తున్నారు. వీటి ద్వారా కాస్త ఎక్కువగానే ఉంటుంది.. కానీ స్వచ్ఛమైన మనసుతో దేవుడిని ప్రార్థించే వారు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# EMI లో ఇల్లు కొంటె ఇరుక్కుపోతారు

## ఈజీగా కొనే మార్గం ఇదే..

చాలా మంది కొత్త ఉద్యోగం రాగానే సొంత ఇల్లు కొనాలని ఎదురు చూస్తారు. ఎక్కడైనా ఫ్లాట్ నచ్చగానే వెంటనే కొనేస్తారు. చేతిలో కొంత డబ్బు ఉన్నా కూడా.. భారీగా లోన్ తీసుకొని ఈఎంఐ ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇటీవల కాలంలో చూస్తే చాలా మంది ఈఎంఐతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.. వచ్చిన జీతం ఎంత ఈఎంఐకె చెల్లిస్తూ మిగతా ఖర్చులు, సేవింగ్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కొందరు నిపుణులు తెలుపుతున్న ప్రకారం ఇల్లు కొనేవారు ఇలా ఈఎంఐలో ఇరుక్కుపోకుండా.. ఈజీగా కొనే మార్గం చెబుతున్నారు.. అదేంటో చూద్దాం..




ఒక ఉద్యోగికి నెలకు 1,50,000 జీతం వస్తుందని అనుకుందాం. ఇతడు కొత్త ఉద్యోగంలోకి రాగానే ఒక కోటి రూపాయలతో ఇల్లు కొనుగోలు చేశాడు. అయితే దీనిపై రూ. 70 వేల ఈఎంఐ ని ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా 20 నుంచి 20 సంవత్సరాల పాటు ఈఎంఐ చెల్లించేందుకు ప్లాన్ చేసుకున్నాడు. అయితే కొత్త ఇల్లు కొన్న తర్వాత కొన్ని రోజులకు అదనంగా ఖర్చులు పెరిగాయి. అంటే కారు కొనాలని అనిపించడం.. ఆ తర్వాత ఇంటిని తీర్చిదిద్దడానికి ఫర్నిచర్ కొనుగోలు.. వంటి వాటికి కూడా ఈఎంఐలను ఏర్పాటు చేసుకున్నాడు. మరి కొన్ని సంవత్సరాలు తర్వాత వివాహమై ఇతర ఖర్చులు పెరిగాయి.. ఇలా తనకు వచ్చే జీవితంలో ఎక్కువ శాతం ఈఎంఐ వలలో పడిపోయి.. తీవ్ర అవస్థలకు గురయ్యాడు. చాలామంది ఇలా కొత్త ఉద్యోగం రాగానే వెంటనే ఈఎంఐని ఏర్పాటు చేసుకొని ఆ తర్వాత ఆవేదన చెందుతున్నారు. అయితే కొందరు నిపుణులు తెలుపుతున్న ప్రకారం కొత్తగా ఉద్యోగం చేరేవారు కనీసం 25 నుంచి 30 ఏళ్ల లోపు వయసు వారై ఉంటారు. ఇలాంటివారు వెంటనే ఈఎంఐతో ఇల్లు కొనుగోలు చేయకుండా.. కనీసం 10 సంవత్సరాల పాటు సేవింగ్స్ చేయాలి. ఈ సేవింగ్స్ ఉదాహరణకు నెలకు రూ.50,000తో sip చేయాలి. ఇలా 10 సంవత్సరాల తర్వాత కోటి వరకు రిటర్న్స్ ఉంటాయి. అయితే అప్పటివరకు ఇల్లు ధరలు పెరగవచ్చు. కానీ వాటికంటే ఈ సిప్ లో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. అయినా కూడా చేతిలో ఉన్న డబ్బుతో సొంత ఇల్లును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఇతర ఖర్చులు మిగతా అవసరాలను కూడా తీర్చుకునే ఛాన్స్ ఉంటుంది.

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు ఈఎంఐ ఏర్పాటు చేసుకుంటే.. ఉద్యోగంలో సమస్యలు వస్తే మరింత మానసికంగా కుంగిపోతారు. అలాకాకుండా తమ వ్యక్తిగత గ్రోత్ ను పెంచుకోవడానికి ఇతర కంపెనీలు లేదా సంస్థలో చేరడానికి అవకాశం ఉండదు. అందువల్ల ఈఎంఐ లో ఇల్లు కొనకుండా.. కొన్ని రోజులపాటు సేవింగ్స్ చేసి ఆ తర్వాత ఫ్లాట్ గురించి ఆలోచించడం మంచిది అని నిపుణులు తెలుపుతున్నారు..

# గుడ్డు ఇలా తినాలి

మనం రోజు తినే ఆహారంలో ప్రోటీన్లు కలిగిన పదార్థాలు ఉండడం చాలా అవసరం. ఇలాంటి వాటిలో కోడిగుడ్డు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. కోడిగుడ్డులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. దీనిని ప్రతిరోజు ఒకటి లేదా రెండు బ్రేక్ ఫాస్ట్ గా తీసుకుంటే రోజంతా ఉత్సాహంగా ఉండడమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కూడా తప్పించుకునే అవకాశం ఉంటుంది. అయితే కోడి గుడ్డును క్రమ పద్ధతిలో తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతారు. నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందని కొందరు ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు కోడిగుడ్డు తినేటప్పుడు ఎలాంటి తప్పులు చేయకూడదు?

కోడి గుడ్డును ఆఫ్ బాయిల్డ్ కంటే బాయిల్డ్ చేసి తినడమే ఆరోగ్యకరం. అయితే గుడ్డును ఉడికించేటప్పుడు తెల్ల సోనా, దీని లోపల ఉండే పచ్చ సోనా బాగా ఉడికేలా చూసుకోవాలి. కొన్నిసార్లు సగం ఉడికిన కోడి గుడ్డును తింటూ ఉంటారు. ఇలాంటి వాటిని తినడం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వీటిని పిల్లలకు తినిపించడం వల్ల జీర్ణక్రియ సమస్యలు ఏర్పడి అనారోగ్యానికి గుర అయ్యే ప్రమాదం ఉంది. చాలా మంది పచ్చి గుడ్డును పగలగొట్టి తినడం వల్ల ఎక్కువగా ఎనర్జీ వస్తుందని నమ్ముతారు. కానీ ఇలాంటి గుడ్డును తినడం వల్ల హానికరమైన బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఇది శరీరంలోకి వెళ్లిన తర్వాత అనేక రసాయనాలు తయారు చేసి కొత్త ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.



కొంతమంది ఉడికించిన గుడ్లను ఎక్కువసేపు బయట వస్తారు. ఇలా ఉంచడం వల్ల త్వరగా పాడే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎప్పుడు తినాలని అనుకుంటాము అప్పుడే గుడ్లను ఉడికించి తిని వేయడం మంచిది. ఉడికించిన కోడిగుడ్లను శుభ్రమైన వాతావరణంలో ఉంచాలి. వీటిపై బ్యాక్టీరియా చేరితే అవి నేరుగా శరీరంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. కొన్ని కోడిగుడ్లు రంగు మారి ఉంటాయి. లేదా ప్రత్యేకమైన స్మెల్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటి వాటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదు. వాటిని దూరంగా ఉంచడమే మంచిది.

గుడ్లను కొనేటప్పుడు వాటి పెంకులను పరిశీలించాలి. కొందరు పగిలిన గుడ్లను తక్కువ ధరకే విక్రయిస్తామని చెబుతారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు. ఎందుకంటే ఈ పగిలిన గుడ్లలో అనారోగ్యాన్ని కలిగించే క్రిములు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ విధంగా గుడ్డు శరీరానికి పోషకాహారం అయినప్పటికీ దానిని తీసుకునే విషయంలో మాత్రం జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

# ఇవి తింటే 10 ఏళ్లు ఎక్కువగా బతుకుతారట

మీరు ఆరోగ్యంగా ఉండాలంటే చాలా చర్యలు తీసుకోవాలి. ఉదయం లేవడం దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. తినే ఫుడ్, వాటర్ అన్ని విషయాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కొందరు వ్యాయామం చేస్తే మరి కొందరు తమ ఆహారాన్ని మార్చుకుంటారు. మీరు ఎటువంటి ప్రయత్నం లేకుండా మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే, మీ రోజులో కచ్చితంగా పప్పు దినుసులు యాడ్ చేసుకోవాలి. మీరు ఆరోగ్యకరమైన అల్పాహారంతో పాటు లంచ్, డిన్నర్ విషయంలో జాగ్రత్త వహించాలి.



కచ్చితంగా మీ రోజులో కంది పప్పు, బొబ్బర్లు, చిక్కుల్లు, పెసల్లు, రాజ్మా, బ్రౌన్ రైస్, గోధుమలతో పాటు పల్లీలు, నట్స్ వంటి వాటిని చేర్చుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు. వీటిని మీ డైలీ డైట్ లో చేర్చుకుంటే కచ్చితంగా మీ ఆయుష్షు పెరుగుతుందట. ఏకంగా పురుషులు 13 సంవత్సరాలు, మహిళలు 10.3 సంవత్సరాలు ఎక్కువగా బతుకుతారు అని చెబుతుంది గ్లోబల్ బర్డెన్. అంతేకాదు వీటితో పాటు చికెన్, మటన్ వంటివి తగ్గించాలి అని సూచిస్తుంది. ఇలా చేయడం వల్ల మీరు కొన్ని సంవత్సరాల పాటు ఎక్కువగా జీవిస్తారన్నమాట.

అయితే ఆహార సమస్యల వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా కోటి పది లక్షల మంది చనిపోతున్నారట. అందుకే మీ డైట్ లో మంచి ఫుడ్ ను చేర్చుకోండి. పైన తెలిపిన పప్పు దినుసులు నట్స్ తీసుకోవడం వల్ల మీకు ఎలాంటి సమస్యలు రావు. ఇందులో ప్రోటీన్, నికోటిన్ ఆమ్లం, థయామిన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ఖనిజాలు, ఇనుము, భాస్వరం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మీకు చాలా ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన కొవ్వు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ బి-6, థయామిన్ వంటి ముఖ్యమైన పోషకాలను ఉండటం వల్ల కంటి చూపు, మెదడు, స్కిన్, గుండె వంటి వాటికి ప్రయోజనం చేకూరుతుంది. మంచి పేగు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతాయి. వీటిని తినడం వల్ల రాత్రిపూట మంచి నిద్ర వస్తుంది.

ఇక బాదం వంటి నట్స్ లలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ ఇ, కాల్షియం, రాగి, మెగ్నీషియం, రైబోఫ్లేవిన్, ఐరన్, పొటాషియం, జింక్, విటమిన్ బీలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రక్తపోటును నియంత్రిస్తాయి. ఇందులో కొన్నింటిని నానబెట్టి తింటే మరింత ఎక్కువ ప్రయోజనాలు చేకూరుతాయి. ఇలాంటి పప్పులు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. వాటిలో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు, ఫైబర్ మంచి మొత్తంలో ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి, గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. అవిసె గింజలు వంటి సూపర్ ఫుడ్ కూడా మీకు చాలా మంచివి. వాటిని నానబెట్టి తినడం వల్ల లిగ్నన్స్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల శోషణ మెరుగుపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

ఈ విత్తనాలలో జింక్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలు, ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. వీటిని నానబెట్టడం వల్ల జీర్ణం కావడం సులభం అవుతుంది. నానబెట్టిన నువ్వులు తినడం వల్ల శరీరంలో కాల్షియం, మెగ్నీషియం శోషణ పెరుగుతుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# సారంపల్లి మరణం రైతాంగ ఉద్యమానికి లోటు

## సంతాప సభలో నాగయ్య, సాగర్

సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. ఆగస్టు 24న ఆర్టీసీ క్రాస్ రోడ్లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య, సాగర్ మాట్లాడుతూ.. రైతు ఉద్యమ చరిత్రలో నిలిచిపోయే విధంగా పోరాటాలు నిర్వహించారని, నిర్మాణంలో తన జీవితాన్ని అంకితం చేశారని భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ, తన జీవితం మొత్తం పేదలు, రైతులు, కూలీలు, శ్రామికుల సమస్యల కోసం పోరాడటానికే అంకితం చేసిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది.



1939 ఆగస్టు 25న తిమ్మంపేట గ్రామంలో రాధమ్మ, కృష్ణారెడ్డి దంపతులకు ఆరుగురు సంతానంలో మూడో సంతానంగా మల్లారెడ్డి గారు జన్మించారు. హన్మకొండలో ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేశారు. ఆయన భార్య భాగ్యలక్ష్మి. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుటుంబంలో ఇటీవలే పెద్ద కుమార్తెను అనారోగ్యంతో కోల్పోవడం ఎంతో విషాదకరం. మల్లారెడ్డి గారు గ్రామ పోలీస్ పటేల్‌గా పని చేశారు. అయితే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సమాజంలోని అసమానతలను, పేద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దగ్గరగా గమనించారు.

ఆ సమయంలో తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమం రహస్యంగా కొనసాగుతున్న పరిస్థితుల్లో, తన తమ్ముడు సారంపల్లి రాజిరెడ్డి ద్వారా మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ గారితో ఆయనకు పరిచయం ఏర్పడింది. పోలీసుల నిఘా నుంచి తప్పించుకుని రహస్య జీవితం గడుపుతున్న ఓంకార్ గారికి తన ఇంటిలో ఆశ్రయం కల్పిస్తూ మల్లారెడ్డి గారు ఉద్యమానికి తన వంతు సహకారం అందించారు. ఆయన రహస్యంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో, చివరకు 1971లో పోలీస్ పటేల్ ఉద్యోగానికి రాజీనామా చేసి, తన జీవితాన్ని పూర్తిగా ప్రజా ఉద్యమానికి అంకితం చేసుకున్నారు. అదే ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపుగా నిలిచింది.

### రైతు సంఘం ద్వారా రైతాంగ సమస్యలపై పోరాటం

మల్లారెడ్డి గారి రాజకీయ జీవితంలో రైతాంగ సమస్యలకు ప్రత్యేక స్థానం ఉంది. రైతుల భూమి, సాగునీరు, గిట్టుబాటు ధర, వ్యవసాయ రుణాలు, కూలీల సమస్యలు, గ్రామీణ పేదల హక్కులు వంటి అనేక అంశాలపై ఆయన నిరంతరం పోరాడారు. రైతు సంఘంలో తాలూకా కార్యదర్శి, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి వంటి బాధ్యతలు నిర్వహించి రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేశారు. అంతేకాకుండా అఖిల భారత కిసాన్ సభ (AIKS) ఉపాధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించడం ఆయన రైతాంగ ఉద్యమంలో ఉన్న విశాలమైన అనుభవానికి నిదర్శనం.

1981లో సర్పంచ్‌గా ఎన్నికై, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం 1987లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై, జిల్లా సహకార సంఘం డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. మల్లారెడ్డి గారి ప్రత్యేకత ఆయన ఉద్యమ జీవితంతో పాటు రచనా రంగంలోనూ కనిపిస్తుంది. రైతాంగ సమస్యలను లోతుగా అధ్యయనం చేసి సుమారు 20 పుస్తకాలు రచించారు. రైతుల జీవన పరిస్థితులు, వ్యవసాయ సమస్యలు, గ్రామీణ సమాజంలోని మార్పులు, రైతాంగ ఉద్యమాల అవసరం వంటి అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా తన రచనల ద్వారా వివరించారు. ఆయనకు కలం కేవలం రచనా సాధనం కాదు — ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మరో పోరాట ఆయుధం.

భూమ్య కుటుంబంలో జన్మించిన వ్యక్తి, పోలీస్ పటేల్ వంటి ప్రభుత్వ బాధ్యతాయుతమైన ఉద్యోగాన్ని వదిలి, తన సౌకర్యవంతమైన జీవితాన్ని పక్కన పెట్టి, జీవితాంతం ప్రజా ఉద్యమానికి అంకితం కావడం మల్లారెడ్డి గారి వ్యక్తిత్వంలోని గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

రైతులు, పేదలు, కూలీలు, అణగారిన వర్గాల సమస్యలే తన రాజకీయ జీవితానికి కేంద్ర బిందువుగా భావించారు. ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమ అనుభవా లు, రచనలు, ప్రజా సేవలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ఒక వ్యక్తి తన జీవితాన్ని ప్రజల కోసం ఎలా అంకితం చేయగలడో మల్లారెడ్డి గారి జీవితం ఒక ఉదాహరణ. ఆయన మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు ఆయన చూపిన ప్రజా ఉద్యమ మార్గంలో నడవడం, ఆయన ఆదర్శాలను కొనసాగించడం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగారెడ్డి, కోశాధికారి మూడ్ శోభన్, సహాయ కార్యదర్శి వెంకట్ మావో, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్, బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్,ఐతే విజయ్, ఆంజనేయులు,శివ విజయ్ తదితరులు పాల్గొన్నారు.







### అంత్యక్రియలు

25/08/2026 ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఆర్ టి సి క్రాస్ రోడ్లోని మాకినేని బసవ పున్నయ్య భవనంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు.అనంతరం ర్యాలీ గా గాంధీ మెడికల్ కాలేజీ వరకు ర్యాలీ గా వెళ్ళి కాలేజీకి అప్పగిస్తారు. ఏఐకెయస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ విజూ కృష్ణన్, కోశాధికారి కృష్ణప్రసాద్, ఆంధ్రప్రదేశ్,తమిళ నాడు కర్నాటక రాష్ట్రాల రైతు సంఘం నాయకులు పాల్గొంటారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



**నాలుగింటి కలయిక ఎందుకు?**

ఉసిరి, కరివేపాకు, మెంతులను కొబ్బరి నూనెలో కలపడం వల్ల పోషకాలు, నూనె అందించే కండిషనింగ్ లక్షణాలను ఒకేసారి పొందాలనే ఉద్దేశం. అయితే ఇది జుట్టు వేగంగా పెరుగుతుందని నిరూపించే బలమైన ఆధారాలు లేవు.



### తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో

# స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపన్ శిక్షణా శిబిరం ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 24:** పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం తిరుమలగిరిలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపన్ శిక్షణా శిబిరం సోమవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ శిబిరం 24 నుంచి 26 ఆగస్టు వరకు కొన సాగనుంది. కేవీఎస్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయెల్ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.హైదరాబాద్ రీజియన్ పరిధిలోని 28 కేంద్రీయ విద్యాలయాల నుంచి సుమారు 200 మంది గైడ్ విద్యార్థులు, 28 మంది ఎస్కార్టులు శిక్షణా శిబిరంలో పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, సేవాభావం, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడం శిబిరం ప్రధాన ఉద్దేశం.పీఎం శ్రీ కేవీ తిరుమలగిరి ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.



కేవీ శివరాంపల్లి పీజీటీ ఎకనామిక్స్ అధ్యాపకురాలు, శిబిర నాయకురాలు (ఎల్ఓసీ) జ్యోతి కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. శారద, చంద్రలేఖ, గంగా భవాని, మనీషా పరీక్షకులుగా వ్యవహరిస్తున్నారు.శిబిర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎ.ఎ. ఇజ్రాయెల్‌కు ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కలర్ పార్టీతో కలిసి ఘన స్వాగతం పలికారు. దీపప్రజ్వలన, ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది. స్కౌటింగ్, గైడింగ్ ఉద్యమ పితామహులు లార్డ్ రాబర్ట్ బాడెన్–పవెల్, లేడీ ఒలావ్ బాడేన్–పవెల్ చిత్రపటాలకు ముఖ్య అతిథి పుష్పాంజలి ఘటించారు.విద్యార్థులు ప్రదర్శించిన గణేష్ వందనం, సోలో నృత్యం ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ముఖ్య అతిథి అభినందించారు.ఈ సందర్భంగా ఎల్ఓసీ జ్యోతి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావం, జట్టు స్ఫూర్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడంలో స్కౌటింగ్, గైడింగ్ కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.మూడు రోజుల శిబిరంలో తృతీయ సోపన్‌లో నిర్దేశించిన వివిధ నైపుణ్యాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ విద్యార్థుల ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, సర్వతోముఖ అభివృద్ధికి దోహద పడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# స్మార్ట్ మీటర్లు పెడితే ఊరుకునేది లేదు

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 24:** కేంద్రం తెచ్చిన కొత్త పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి తెలంగాణలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, ఈ ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు.కేంద్రం ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోకరిల్లి ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటోందని ఆమె విమర్శించారు. గతంలో రైతులను ఇబ్బందులకు గురిచేసేలా తీసుకురావాలనుకున్న స్మార్ట్ మీటర్లను ఇప్పుడు మళ్లీ ప్రవేశపెట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. అదానీ వ్యాపార ప్రయోజనాలను ప్రోత్సహించేందుకే స్మార్ట్ మీటర్లను తీసుకువస్తున్నారని విమర్శించారు.కొత్తగా ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కవిత అన్నారు. ప్రీపెయిడ్ విధానంలో



ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని, రీఛార్జ్ ముగిసిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజలు వాటిని తొలగించి విద్యుత్ శాఖ కార్యాలయాల్లో అప్పగించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు.స్మార్ట్ మీటర్ల కారణంగా ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి, సెలూన్లకు అందించే ఉచిత విద్యుత్‌కు, ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న సబ్సిడీ విద్యుత్‌కు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే విధానాలను అమలు చేయాల్సిన ప్రభుత్వం వారి జేబులకు చిల్లు పెట్టే నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.ప్రస్తుతం ఉన్న మీటర్ల ద్వారానే ప్రజలకు 24 గంటల విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు.తెలంగాణలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే తెలంగాణ రక్షణ సేన తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తామని కవిత హెచ్చరించారు.

### శ్రీ విద్యారణ్య పాఠశాల విద్యార్థులకు

# రాష్ట్రస్థాయి క్రీడల్లో గోల్డ్ మెడల్స్

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** క్రీడల్లో నైపుణ్యం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ విద్యతో పాటు అన్ని రంగాల్లో అవలీలగా విజయాలు సాధిస్తారని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ అన్నారు. మహబూబ్ నగర్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఇటీవల ఖేల్ ఖూద్ పేరుతో రాష్ట్రస్థాయి క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బండ్లగూడ జాకెట్ లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ఏకంగా ఆరు బంగారు పథకాలు సాధించారు. అండర్ 17 బ్యాడ్మింటన్ లో నాడం లక్షిత రెడ్డి బంగారు పతకం సాధించింది. 100, 400 మీటర్ల పరుగు పందెంలో చతుర్, వాలీబాల్ లో ప్రజ్ఞా బృందం, చదరంగంలో ఏకాంక్ష లు రాణించి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు, ప్రిన్సిపల్ విశ్వనాథన్లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రతి



ఒక్కరి జీవితంలో చదువుతోపాటు క్రీడలు ముఖ్య భూమికగా ఉండాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉత్తేజంగా ఉంటూ చదువులోనూ, జీవితంలోని విజయాలు సులువుగా సాధిస్తారు అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సహిస్తూ చేయూతని ఇవ్వడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు కార్తీక్, సంజీవ్, నాయక్, చారి, శైలజ తదితరులు ఉన్నారు.

### జగదాంబిక ఆలయ పని వృత్తి పని వారల సంఘం

# అధ్యక్షులుగా శివశంకర్ ఏకగ్రీవ ఎన్నిక

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** నియమ నిష్ఠలతో అమ్మవారిని సంతోషపరిచి, ప్రజలను చూసే విధంగా తాము అంత కలిసి మరింత వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని గోల్కొండ జగదాంబిక ఆలయ పనివృత్తి వాళ్ళ సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్ అన్నారు. తెలంగాణ బోనాల కావాలి నిర్వహించే ప్రధాన దేవాలయం అయిన గోల్కొండ జగదాంబిక ఆలయ పనివృత్తి వార్ల అధ్యక్షునిగా తంగేడి పల్లి శివశంకర్ ను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో వసంత, పెద్దల ఆధ్వర్యంలో అన్ని రకాల కుల, పని వృత్తి వార్లు ఆయనను ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ప్రస్తుతం గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలతో పాటు, లంగర్ హౌస్ ప్రధాన దేవాలయం అయినా బుజిలీ మహంకాళి బోనాలు ఉత్సవాలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీరి అన్న బైండ్ల మేఘ రాజు



బైండ్ల పూజారిగా, కుమారుడు భార్గవ్ పోతరాజు, గావు, రంగం భవిష్యవాణి తదితర ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు రాజు వస్తాద్, చైర్మన్ చంద్రశేఖర్, నాగన్న లో శివ శంకరును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# సేవ్ ఎర్త్ ఫౌండేషన్ కు మదర్ ఇండియా జాతీయ అవార్డ్ 2026

**ముద్ర, హైదరాబాద్ :** జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ విభాగంలో విశేషంగా కృషి చేస్తున్న సేవ్ ఎర్త్ ఫౌండేషన్ కు స్వదేశీ సంస్థాన్ ఇండియా అయోధ్య యుపి. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ అవార్డులను అయోధ్యలోని సాగర్ కళా భవన్ వేదికగా ప్రదానం చేశారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సేవ్ ఎర్త్ ఫౌండేషన్ మదర్ ఇండియా 2026 కు ఎంపికయింది. అనివార్య కారణాలవల్ల అయోధ్యకి వెళ్లలేక పోయినా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి చేతుల మీదుగా మదర్ ఇండియా అవార్డును స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ ను శాలువా తో సత్కరించి మెమొంటోని సర్టిఫికెట్ ని బహూకరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి మెరుగైన సేవలు అందించడం కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకుల యొక్క సేవలు అమూల్యమైనవన్నారు. సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్ తన జీవిత లక్ష్యంగా స్వచ్ఛంద సేవలో నిమగ్నమై తెలంగాణకు కోటి మొక్కల మణిహారం లక్ష్యంగా ఐదు లక్షలకు పైగా మొక్కలు నాటడం, నాలుగు వేలకు పైగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ధార్మిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలోను పాల్గొంటూ ఇరవై ఐదు




వేలకు పైగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేయడం వందలాది స్కూల్స్ లో పాఠశాల స్థాయి, మండల స్థాయి జిల్లా స్థాయిలలో భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించడం, వ్యక్తిత్వ వికాసం కోసం నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించడం ఆయా అంశాలపై చిత్రలేఖనం, వకృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తూ వారిని ప్రోత్సహించడం ప్రతిభకు గుర్తింపు నివ్వడం, నిరుపేద విద్యార్థుల కోసం దూర విద్యా విధానాల ద్వారా విద్యను అందించడం శీతాకాలంలో రోడ్డుపై నిద్రిస్తున్న అభాగ్యులకు బ్లాంకెట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం, వేసవిలో పశుపక్షాదులకు నీరు, ఆహారం పెట్టడం, తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షన్ రోడ్డు భద్రతా కార్యక్రమాలు, కరోనా, వరదలు, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నియంత్రణ, మత్తు వ్యసనాలపై అనేక అవగాహన కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తుండటం వల్ల స్వదేశీ సంస్థాన్ ఇండియా వారి సంస్థ సేవలను గుర్తిస్తూ స్వదేశీ భూషణ్ అదేవిధంగా మదర్ ఇండియా అవార్డును అందజేయడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. ఇలాంటి నిస్వార్థ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం ఆదర్శనీయం. గతంలో అంతర్జాతీయ, జాతీయ అవార్డులు విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్, ఇండియన్ ఐకాన్, పర్యావరణ మిత్ర, సేవారత్న, వనమాలి, నెల్సన్ మండేలా ఎక్సలెన్స్ వంటి అంతర్జాతీయ తదితర అవార్డులు పురస్కారాలను పొందడం వారి నిరంతర కృషి కీ నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన శ్రేయోభిలాషులు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కు కారణం తనను డైరక్ట్ చేస్తున్న సంస్థ ప్రతినిధులు, నాతో కలిసి క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వాలంటీర్స్ అన్నారు. జాతీయ స్థాయి గుర్తింపు ను పొందడం గర్వంగా ఉంది తమపై మరింత బాధ్యతను పెంచిందని అందరికీ హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, గోషిక విఠలేశ్వర్ విజయ్ కుమార్ డాక్టర్ యాదగిరి, జి రాజేందర్ రెడ్డి, నీలం సురేష్ జయసూర్య, రామచంద్రవర్ధన్, శ్రీలతారాణి దైవం టీమ్ హరికృష్ణ, యజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

## దాశరథి రంగాచార్యకు సీఎం రేవంత్ రెడ్డి నివాళి



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని తన కలంతో ఆవిష్కరించిన సాహితీయోధుడు, తెలుగు సాహిత్యానికి అపూర్వ సేవలందించిన దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.తెలంగాణ పల్లె జీవనాన్ని, ప్రజల కష్టాలను, సామాజిక వాస్తవాలను తన రచనల్లో సజీవంగా ప్రతిబింబిస్తూ ప్రజల పక్షాన నిలిచిన మహోన్నత సాహితీవేత్త దాశరథి రంగాచార్య అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యాన్ని, నాటి సామాజిక పరిస్థితులను అక్షరబద్ధం చేసి, ఆ పోరాట స్ఫూర్తిని తరతరాలకు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు.వేదాలు, ఉపనిషత్తులు వంటి అపారమైన భారతీయ జ్ఞాన సంపదను తెలుగులోకి అనువదించి సామాన్య పాఠకులకు చేరువ చేయడంలో దాశరథి రంగాచార్య చేసిన కృషి తెలుగు భాష, సాహిత్య చరిత్రలో చిరస్మరణీయమని సీఎం అన్నారు.సాహిత్యాన్ని ప్రజా చైతన్యానికి సాధనంగా మలిచిన దాశరథి రంగాచార్య జీవితం, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## సీపీఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత



**ముద్ర, హైదరాబాద్ :** ఎ ఐ. కె. ఎస్. ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, కుమారులు వాసుదేవ రెడ్డి,మధు సూధన్ రెడ్డి, కుమార్తెలు, అనిత, సునీత ఉన్నారు. అనారోగ్య కారణంతో పెద్ద కుమార్తె అనిత ఇటీవలే మృతి చెందారు. వయోరిత్యా శ్వాసకోశ సమస్య రావటంతో ఆయన్ను కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడే వైద్యులు వైద్య సేవలందిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆరోగ్యం మరింత క్షీణించటంతో వైద్యులు అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 3.30గంటలకు మల్లారెడ్డి తుదిశ్వాస విడిచారు.మృతదేహాన్ని నిమ్స్ మార్చురీ లో భద్రపరిచారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, కేవీపీస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బాబురావు తదితరులు మల్లారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.మల్లారెడ్డి మరణం పట్ల పలువురు నాయకులుతీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటనీ సంతాపం తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి గారు మరణించారని తెలిసి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి గారని పేర్కొన్నారు.సారంపల్లి మల్లారెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గచ్చిబౌలిలో భవనం కూలిన ఘటనలో యజమాని సయ్యద్ సాజిద్ అరెస్టు

**ముద్ర, హైదరాబాద్:**గచ్చిబౌలిలో భవనం కూలిన ఘటనలో యజమాని సయ్యద్ సాజిద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సాజిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. సాజిద్ అనుమతులు లేకుండా అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం నిర్మించగా, నాసిరకం నిర్మాణంతో ఈ నెల 22న భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటనలో భవనం కాంట్రాక్టర్ ఖాజా కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## ప్రైవేటు హాస్టల్‌లో యువతి అనుమానాస్పద స్థితిలో మృతి

**ముద్ర, హైదరాబాద్:** సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందింది. హాస్టల్‌లో సురేఖ(25) అనే యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానిస్తున్నారు. వికారాబాద్ జిల్లా యాచారంకు చెందిన సురేఖ 7 నెలల క్రితం తల్లిదండ్రులను మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేసింది. కులాంతర వివాహానికి అడ్డొస్తున్నారని తండ్రి దశరథం(58), తల్లి(54) ప్రాణాలు తీసింది. తల్లి దండ్రులను హత్య చేసిన కేసులో సురేఖ జైలుకు వెళ్లింది. ఇటీవల జైలు నుంచి వచ్చి సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో చేరింది. జిల్లాలోని హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక సమాచారం. ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు

**ముద్ర, హైదరాబాద్:**ఉత్తర, ఈశాన్య జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీహైదరాబాద్ : అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు కురవనున్నాయి. ఇవాళ ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. వాతావరణ శాఖ ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతమై ఉండనుంది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు సూచనలున్నాయి. రేపు ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయి.

**శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం**

పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం చేరుతుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 20.17 టీఎంసీలు కాగా ప్రసుత్త నీటి నిల్వ 16.89 టీఎంసీలుగా ఉంది. పూర్తి నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 146.80 మీటర్లు ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 6,244 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 406 క్యూసెక్కులుగా ఉంది.నిజాంసాగర్ ప్రాజెక్టుకు 3,185 క్యూసెక్కుల వరదకామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు 3,185 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1401.06 అడుగులుగా ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 17.80 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 12.54 టీఎంసీలుగా ఉంది.

## హరిదాసు పుర నూతన కమిటీ ఎన్నిక



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** లంగర్ హౌస్ హరిదాసు పుర నూతన కమిటీ ఎన్నిక అయ్యింది. అధ్యక్షునిగా బుజిలి మహంకాళి ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా మురళి కృష్ణ, పుల్ మామిడి ప్రవీణ్ లను, కోశాధికారిగా పవన్, రవి ప్రకాశ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బాల్ రాజ్ హరిదాస్ పుర తో పాటు పలు కాలనీల వినాయకుల కోసం డబ్బులు అందజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
**ముద్ర**
మంగళవారం 25.08.2026
www.mudranews.in | @mudranews



**మెంతులు.. జుట్టు రాలడాన్ని తగ్గించడంలో**

మెంతుల్లో ప్రోటీన్ వంటి పోషకాలు ఉంటాయి. మెంతులను నూనెలో కలిపి వాడటం జుట్టుకు కండిషనింగ్ ఇవ్వడంలో, పొడిబారడం తగ్గించడంలో ఉపయోగపడొచ్చు.



## అర్హులందరికీ చేయూత పింఛన్లు.. చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి : మంత్రి పొన్నం




**ముద్ర, చిగురుమామిడి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందిస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూముల అంశంపై రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బోదకాలు బాధితులు సహా పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూముల అంశంపై రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇల్లు లేని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఓగులాపూర్ లో ఇప్పటికే 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా చెక్ డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామైక్య సంఘం భవనంలో మొక్కలు నాటారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను పంపిణీ చేశారు.

## ఇంకుడు గుంతల నిర్మాణంలో నంబర్ వన్‌గా నిలవాలి

*** కరెంటు సమస్యను వెంటనే పరిష్కరిస్తా..**
*** రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలి..**
*** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో పర్యటించిన మంత్రి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, ఈ విషయంలో నవాబుపేట రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. గ్రామంలో విద్యుత్ సమస్యపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

**నవాబుపేటకు ప్రభుత్వ పథకాల లబ్ధి**

గ్రామంలో 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 629 మందికి మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, 754 కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందుతోంది. 1,143 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.6.90 కోట్లు, 452 మందికి రుణమాఫీ కింద రూ.4.09 కోట్లు లబ్ధి చేకూరింది. 519 మందికి సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయి. కొత్తగా 157 రేషన్ కార్డులు మంజూరు కాగా, 304 మంది పేర్లు నమోదు చేశారు. కళ్యాణలక్ష్మి కింద 42 మందికి రూ.42 లక్షలకు పైగా సాయం అందింది.గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల గారు,డీపీవో జగదీశ్వర్ గారు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి గారు, గ్రామ సర్పంచ్ గూళ్ల రజిత రాజు, తహసీల్దార్ కనకయ్య గారు,ఎంపీడీవో రామ్మోహనాచారి గారు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## హైదరాబాద్ కళారంగానికి కొత్త చిరునామా..

**- ఏక్‌చిత్ర ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం**

**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్ నగరంలో కళాభిమానులకు మరో కొత్త వేదిక అందుబాటులోకి వచ్చింది. పెయింటింగ్, శిల్పకళ, సెరామిక్స్, ఇన్ స్టాలేషన్స్, ఫొటోగ్రఫీ, మిక్స్ డ్ మీడియా తదితర విభిన్న కళారూపాలకు వేదికగా ఏక్ చిత్ర ఆర్ట్ గ్యాలరీ ప్రారంభమైంది. వర్ధమాన కళాకారులతో పాటు ప్రముఖ కళాకారులకు కూడా అనువైన వేదికగా దీన్ని రూపొందించినట్లు వ్యవస్థాపకురాలు, ఆర్టిస్ట్, క్యురేటర్ అన్నపూర్ణ మడిపడిగ తెలిపారు. గ్యాలరీలో శాశ్వత ప్రింట్ మేకింగ్ స్టూడియోను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రింట్ మేకింగ్ ను ప్రోత్సహించడంతో పాటు శిక్షణ, వర్క్ షాపులు, స్క్రీనింగ్స్, డిబేట్స్, ఆర్ట్ ఎక్స్చేంజ్ వంటి కార్యక్రమాలకు కూడా గ్యాలరీ వేదికగా నిలవనుంది. కళాకారులు, డిజైనర్లు, ఆర్కిటెక్ట్స్, పరిశోధకులు, సాంస్కృతిక రంగానికి చెందిన వారిని ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యమని అన్నపూర్ణ వెల్లడించారు. ఏక్ చిత్ర తొలి ప్రదర్శనగా 'ట్రాన్సిషన్: ఎ కంటిన్యూటీ టు చేంజ్ – యాన్ ఓడ్ టు ఐడెంటిటీస్ ఇన్ ఫ్లక్స్'ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పలువురు కళాకారులు ఇందులో పాల్గొంటున్నారు. శిల్పకళ, పెయింటింగ్, సెరామిక్స్, ప్రింట్ మేకింగ్ తదితర కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శిస్తున్నారు.ప్రారంభోత్సవానికి ఆర్ట్ కలెక్టర్ అంజూ పొద్దార్, దర్శకులు దేవ కట్టా, వెంకటేశ్ మహా, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, సీనియర్ కళాకారులు బీఏ రెడ్డి, శంకర్ పామర్తి తదితరులు హాజరై ఏక్ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. విభిన్న కార్యక్రమాలతో హైదరాబాద్ కళా ప్రపంచానికి ఏక్ చిత్ర మరో ప్రత్యేక చిరునామాగా మారనుంది.



# అభివృద్ధి పనుల్లో మంత్రి అడ్లూరి

**నాగారం గ్రామంలో నూతన మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి అడ్లూరి**

**ముద్ర న్యూస్, ధర్మపురి :** ధర్మపురి మండలం నాగారం గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్ నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుం దని పేర్కొన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్ద పీట వేస్తుందని ఉచిత బస్సు ప్రయాణం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని,నూతన మహిళా సంఘ భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక మహిళా సంఘాల కార్యకలాపాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ...అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఒక లక్ష 63 వేల 100 రూపాయల నగదు, 52 పేక ముక్కలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం....**

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో ఒక ఇంటి వద్ద డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో కోరుట్ల ఎస్సై జి. శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరం పై దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతు న్న 5 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకు న్నారు. వారి వద్ద నుండి పేకాటకు పందెంగా ఉపయోగిస్తున్న రూ.1,63,100/– నగదు, 52 పేక ముక్కలు మరియు 5 మొబైల్ ఫోన్లను పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై గేమింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది. డబ్బులు పందెంగా పెట్టి పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అసాంఘిక అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ పరిసరాల్లో జూదం లేదా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

**మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై**

## టీపీసీసీ చీఫ్ అసంతృప్తి

**ముద్ర, హైదరాబాద్:** మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అసంతృప్తి.. నామినేటెడ్ పోస్టుల భర్తీపై జాబితా అడిగితే ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదన్న మహేష్ గౌడ్.. వెంటనే జాబితాను పంపండని మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచన.. పాతవారికి 70శాతం, కొత్తవారికి 30శాతం పదవులు సిఫార్సు చేయాలని ఆదేశారు.

## 22ఏ నుంచి పట్టా భూములను తొలగించాలి

**మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల**



**ముద్ర, కరీంనగర్:** 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. భూ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రైవేటు పట్టా భూములను సరైన ప్రక్రియ పాటించకుండా 22ఏ జాబితాలో చేర్చడం వల్ల వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని గంగుల ఆరోపించారు. రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లోని అర్హత కలిగిన భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని కోరారు.

22ఏ సెక్షన్ దుర్వినియోగానికి నైతిక బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే 'చలో సెక్రటేరియట్'కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో.. ఎమ్మెల్యే గంగులతో పాటు.. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, టిఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు టీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు.. ప్రజా ప్రతినిధులు.. భూ బాధితులు.. బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 22ఎ పై ప్రతిపక్షాల డ్రామాలెందుకు?

**పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అనేక భూదందాలు**
**ధరణి పేరుతో ఎంతమందిని గోసగుచ్చుకున్నారు**
**స్వయంగా ముఖ్యమంత్రి,రెవెన్యూ మంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి పర్యవేక్షిస్తున్నారు**
**22ఎ పరిధిలో ఉన్నవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్ :** 22ఎ సమస్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చిన వెంటనే రెవెన్యూ మంత్రితో అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవ్వరు కూడా ఇబ్బందులు పడొద్దని చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుంటే ప్రతి పక్షాలు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వమే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి త్వరితగతిన విచారణ జరిపి పరిష్కరించమని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వగా కలెక్టర్లు రెవెన్యూ అధికారులు అదే పనిమీద ఉన్నారని దీంట్లో ప్రతిపక్ష పార్టీలు సొచ్చి లబ్ది పొందాలని చూడడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.భూదందాలకు కేరాఫ్ అడ్రసే బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు ధరణి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసి అనేక భూదందాలకు పాల్పడి భూకబ్జాలలో వాళ్ల నాయకులు జైలుకు వెళ్లి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ డ్రామాలు ఆడుతున్నారని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా 22ఎలో ఉన్న వారికి స్పష్టంగా తెలియజేస్తున్నాం మీకెవ్వరి మద్దతు అవసరం లేదు ప్రభుత్వమే మీ పక్షాన నిలబడి ఉంది అధికారులు అదే పనిమీద ఉన్నారు ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో కుర్ర పోచయ్య,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ముక్క భాస్కర్,అస్తాపురం రమేష్, మామిడి సత్యనారాయణ రెడ్డి,భారీ,బషీర్,మిరాజ్,తోట అంజయ్య,లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి పెద్దిగారి తిరుపతి,బత్తుల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ నిరసన

**ఫీజు రియంబర్స్మెంట్ భిక్ష కాదు.. విద్యార్థుల హక్కు**
**బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్‌లో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యం లో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడు తూ.. ప్రభుత్వం వెంటనే రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి,కన్నా కృష్ణ ,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు ,జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహరాజు, చేపూరి సత్యం మీడియా కన్వీనర్ కటకం లోకేష్ మండల అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, కంది రాజిరెడ్డి ,చింతం శ్రీనివాస్ ,తనకు సాయికృష్ణ, పాదం శివరాజ్, కార్పొరేటర్ లు బండ రమణ రెడ్డి, దేశీ శిల్పా పెద్దపల్లి శ్రీలేఖ ,తాటి ప్రభావతి మాసం గణేష్ ,భూపతి రవీందర్, తోట అనిల్. టీంకు, ఒంటెల సత్యనారాయణ రెడ్డి ,మహిళా మోర్చఅధ్యక్షులు గుర్రాల నిర్మల రెడ్డి , ఎస్టి మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , వెంకట్ రెడ్డి , ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆడి చెర్ల రాజు రమేష్ దూలం కిరణ్, ఆవుల తిరుపతి ,రవి ప్రసాద్ గుర్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



### కొబ్బరి నూనె.. తేమను అందిస్తుంది

కొబ్బరి నూనె జుట్టు షాఫ్ట్‌లోకి చొచ్చుకుపోయి ప్రోటీన్ నష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీంతో జుట్టు పొడిబారడం, విరిగి పోవడం తగ్గొచ్చు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి







**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 24 :** ప్రజలు తమ సమస్యలను తెలుపుతూ సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా పలు కీలక సమస్యలపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేంసూరు మండలం లింగపాలెం ఎస్సీ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతూ, డ్రైనేజీలను పూడ్చివేసి అక్రమంగా బోరు వేశారని కాలనీవాసులు అందజేసిన ఫిర్యాదుపై తహసిల్దార్ తక్షణమే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో రైతుల ఆవేదన.. రైతుబంధు, యూరియా బుకింగ్, వడ్ల అమ్మకంలో ఇబ్బందులు**

**ముద్ర, తుంగతుర్తి;** రైతుబంధు రావడం లేదని, అలాగే వడ్ల అమ్మకం, యూరియా బుకింగ్ చేసుకోవడానికి అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.తుంగతుర్తి గ్రామానికి చెందిన గుడిపూడి ఆగారావు, దుగ్యాల హనుమంతరావు, శంకరమంచి రవీందర్ శర్మలు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా తమకు ఈ సమస్యలు ఎదురవుతున్నాయని, రైతుబంధు నిధులు తమ ఖాతాల్లో జమ కావడం లేదని తెలిపారు.అంతేకాకుండా యూరియా యాప్‌లో యూరియా బుక్ చేసుకోవడానికి, ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించడానికి అవకాశం లభించడం లేదని వాపోయారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగామని, అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేయాలని వారు ప్రజావాణిలో కోరారు.

**ప్రజావాణికి 67 అర్జీలు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 67 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 46, సర్వే ల్యాండ్స్ 5, వైద్య ఆరోగ్య శాఖ 3, డిఎల్పిఓ 3, మున్సిపాలిటీ 2, గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ శాఖ, పంచాయతీ, ఎస్సీ వెల్ఫేర్, కోపరేటివ్, విద్యుత్, స్పెషల్ డిప్యూటీ యూనిట్, విద్య శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రసాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పి సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సూర్యాపేటలో..**

**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 24:** ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణిలో స్వీకరించే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అధికారుల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారమైతే ప్రజలకు జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే వనమహోత్సవంలో జిల్లా అధికారులు సామూహికంగా పాల్గొని తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా, మండల ప్రభుత్వ కార్యాలయాల్లో ఆగస్టు 31లోగా టీ–ఫైబర్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 68 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 43, ఇరిగేషన్‌కు 4, మున్సిపాలిటీకి 4, డీడబ్ల్యూవోకు 3, ఇతర శాఖలకు సంబంధించిన 14 దరఖాస్తులు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపినట్లు కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈవో శిరీష, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు, డీపీఓ యాదగిరి, డీఏఓ శ్రీధర్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి, జిల్లా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా గ్రామాలలో వాటర్ మెన్స్ పారిశుద్ధ్య కార్మికులుగా బిల్లు కలెక్టర్గా ఎలక్ట్రిషన్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అధ్యక్ష కార్యదర్శులు పొట్ట యాదమ్మ, రకరకంటి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షం జ్ఞానేశ్వర్, నాయకులు కిష్టయ్య, పరమేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పాదయాత్ర గోడ పత్రిక పోస్టర్ విడుదల



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి, పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి అంబేద్కర్ చౌరస్తా నుండి హైదరాబాద్ ఇంద్ర పార్క్ వరకు పాదయాత్ర గోడ పత్రిక ను రైతు బజార్ లో సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాధర్నాను విజయవంతం చేయాలని రైతులకు ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐఎం పట్టణ సెక్రెటేరియట్ సభ్యులు గంధ మల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, వనం రాజు, పట్టణ నాయకులు నరాల నరసింహ, బుర్ర అనిల్. కొత్త లలిత, మన్నె రాజు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు కార్యదర్శి మేడ పోయిన సుందర్ ఎండి సలీం పాల్గొన్నారు.

## ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

**ఎన్ఐఎస్ఏ నేషనల్ ప్రెసిడెంట్ కుల భూషణ్ శర్మ**



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ స్కూల్ నందు విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థుల చేతుల లో దారుణ హత్యకు కళ్ళు రూపా రెడ్డి గురి కావడం చాలా బాదకరమైన సంఘటన అని అన్నారు. పాఠశాల ప్రాంగణంలో రూప రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సంఘటనని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సమాజంలో పిల్లలు ఎటువైపు వెళ్తున్నారో అర్థం చేసుకోవాలని నేషనల్ ఇండిపెండెన్స్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు కులభూషణ్ శర్మ ( హర్యానా ) ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలని వాళ్ళు ఎవరితో, ఎక్కడెక్కడ తిరుగుతున్నారు అనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే సాధ్యమైనంత వరకు పిల్లల్ని మొబైల్స్ కు దూరంగా ఉంచాలని సూచించారు. అలాగే ఈ సంఘటనపై ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధ్యాయులపై ఎవరైనా దాడి చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకొనే విధంగా చట్టం తీసుకురావాలని తెలియజేశారు. పిల్లల్ని పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించినప్పుడు తల్లిదండ్రులు గమనించి దానికి గల వివరాలు తెలుసుకోవాలి కానీ ఉపాధ్యాయులపై దాడి చేయడం, ఘర్షణ కి దిగడం మానుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారు వీరికి రక్ష కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కూడా బాగా చదువుకొని మంచి ప్రవర్తనతో చదువు నేర్పిన గురువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచిగా పేరు తీసుకువచ్చే విధంగా ఉండాలని ప్రెసిడెంట్ పరంజ్యోతి తెలిపారు. అలాగే పాఠశాల యాజమాన్యానికి ఉపాధ్యాయులకు విద్యార్థులకు మనోధైర్యం నింపే విధంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎస్ఏ ప్రెసిడెంట్ కులభూషణ్ శర్మ, వైస్ ప్రెసిడెంట్ పరంజ్యోతి, రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు, అభిలాష్, ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ప్రభాకర్ రెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, మారం ఆనంద రెడ్డి, శ్రవణ్, జంగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి సంతాపం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, వ్యవసాయ రంగంపై లోతైన అవగాహన కలిగిన మేధావి, అఖిల భారత కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లెల పెంటయ్య, కొండమడుగు నర్సింహ్మ లు ఒక ప్రకటనలో తెలిపారు. మల్లారెడ్డి మరణం రైతాంగ, వ్యవసాయ కార్మిక, గ్రామీణ శ్రామిక ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. రైతు సంఘం నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో, ప్రజా ఉద్యమాల కేంద్రంగా తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.

## స్వర్ణగిరిలో మహాలక్ష్మి హవనం

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి నిత్యార్చనలు, నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం, అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హవనం నిర్వహించారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారి కి విశేషంగా సహస్ర కుంకుమార్చన సేవ నిర్వహించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి





## బకాయిలు చెల్లించండి.. లేదంటే సమరమే!

*** రేవంత్ ప్రభుత్వంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ధ్వజం**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 24:** రాష్ట్రంలో పేరుకుపోయిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు హెచ్చరించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఫీజు బకాయిల కోసం మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన నిరాహార దీక్షకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులు, నాయకులతో కలిసి హైదరాబాద్ ముట్టడిస్తామని స్పష్టం చేశారు.సామాన్యుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెడుతూ ప్రభుత్వం ఇబ్బందులు గురిచేస్తుందని, ఫీనిక్స్ వంటి పెద్ద సంస్థలకు భూకేటాయింపులు ఏ నిబంధనల ప్రకారం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏళ్లుగా నలుగుతున్న అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేదంటే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని అన్నారు. రైతు రుణాలు, ఉద్యోగాల కల్పన వంటి ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు, కృష్ణయ్య, రుద్రగాని మాధవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది స్వీయ నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణతో ఉండాలి

**ముద్ర, సూర్యాపేట:** పోలీసు సిబ్బంది స్వీయ నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సంక్షేమ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ, పౌరుల భద్రత కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహించాలని అన్నారు. కఠినమైన శిక్షణ పొందిన పోలీసు సిబ్బంది సాధారణ పౌరులతో పోలిస్తే భిన్నంగా వ్యవహరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.అధిక లాభాల ఆశతో భద్రత లేని పథకాలు, అనధికారిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు. బెట్టింగ్‌లు, చెడు అలవాట్లు, సోషల్ మీడియా వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసర విలాసాల కోసం అప్పులు చేసి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టవద్దని చెప్పారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు, కుటుంబ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ పిల్లల ఉన్నత విద్య కోసం ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ అన్నారు. చట్టాన్ని రక్షించే పోలీసు సిబ్బంది ఎలాంటి తప్పులు, నేరాలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా లేదా వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి నిర్భయంగా తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పోలీసు సిబ్బందికి ఆర్థిక నిర్వహణ, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక క్రమశిక్షణపై పలు సూచనలు అందించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, అడ్మిన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నారాయణరాజు, ప్రవీణ్ కుమార్, ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ చీఫ్ మేనేజర్ అరుంధతి, ఫైనాన్షియల్ అసిస్టెంట్ మేనేజర్ రామిరెడ్డి, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలతో రైతుల్లో హర్షాతిరేకాలు

**సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 24 :** ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు మిశ్రమ ఫలితాలను ఇస్తున్నాయి. ఒకవైపు నీరసించిన వ్యవసాయ రంగానికి ఈ వర్షాలు జీవం పోసి రైతాంగానికి ఎనలేని సంతోషాన్ని ఇవ్వగా, మరోవైపు పారిశ్రామిక రంగానికి, ముఖ్యంగా సింగరేణి బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి.గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఆందోళన చెందుతున్న అన్నదాతలకు ఈ వానలు తీవ్ర ఊరటనిచ్చాయి. వానల ధాటికి జిల్లాలోని చెరువులు, కుంటలు నిండి కళకళలాడుతున్నాయి. నీటి కొరత వల్ల మందకొడిగా సాగుతున్న వరినాట్ల పనులు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా తీవ్ర వేగం పుంజుకున్నాయి. నీరు లేక వాడిపోతున్న పత్తి, పెసర పంటలకు ఈ వర్షం ఊపిరినిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంట సాగుకు నీటి ఇబ్బందులు ఉండవనే ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, పడుతున్న వర్షాల ప్రభావం సింగరేణి గనుల తవ్వకాలపై తీవ్రంగా పడింది. ఉమ్మడి జిల్లాలోని ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వర్షపు నీరు భారీగా చేరడంతో బొగ్గు ఉత్పత్తితో పాటు మట్టి తొలగింపు పనులకు తాత్కాలికంగా విఘాతం కలిగింది. మణుగూరు ఓపెన్ కాస్ట్‌లోకి నీరు చేరడంతో దాదాపు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లోనూ వర్షపు నీరు నిలిచిపోవడంతో అక్కడ సుమారు 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.గనుల్లో పనులు పూర్తిగా నిలిచిపోవడంతో సింగరేణి అధికారులు రంగంలోకి దిగారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు తరలించేందుకు యంత్రాలతో చర్యలు వేగవంతం చేశారు. నీటి తోడివేత పూర్తయిన వెంటనే బొగ్గు ఉత్పత్తిని, మట్టి తొలగింపు పనులను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

**డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 24 :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR–2026) ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు.అనామలీస్, నో–మ్యాపింగ్ కింద నమోదైన ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కు కోల్పోకుండా, బిఎల్ఏలు సంబంధిత బిఎల్ఓ లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులను బూత్ లెవెల్ సూపర్ వైజర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. వీరు తమ పరిధిలోని అన్ని బూత్‌లను పరిశీలిస్తూ ఏజెంట్లకు తగిన సలహాలు అందించాలన్నారు.ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సూపర్ వైజర్లు, ఏజెంట్లు భాగస్వాములై అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని ఆయన కోరారు.

## తుంగతుర్తి మత్స్యశాఖ నూతన కమిటీ



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో మత్స్యశాఖ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహకార సంఘం కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.పద్మజ అధ్యక్షతన ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది.ఈ ఎన్నికల్లో మత్స్యశాఖ అధ్యక్షుడిగా రెండోసారి కొండ లింగయ్య, ఉపాధ్యక్షుడిగా అంబటి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సొసైటీ సభ్యులుగా మామిడి లింగయ్య, మామిడి నరేష్, దిండి ముత్యాలు, కొండ వెంకన్న, సాధు వెంకన్న, అంబటి బుచ్చయ్యలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సభ్యులు, నాయకులు కొండ ఎల్లయ్య, కొండ రాజు, కొండా పరుశురాం, సుధాకర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



## ఉసిరి.. జుట్టుకు పోషణ

ఉసిరిలో విటమిన్ C, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జుట్టు, స్కాల్ప్ ఆరోగ్యానికి తోడ్పడటంతో పాటు జుట్టు బలంగా ఉండేందుకు సహాయ పడవచ్చు.



# హద్దులు దాటితే ఉపేక్షించేది లేదు

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరిక



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ ఉందని హద్దులు దాటితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. సోమవారం మెదక్ లో వినాయక ఫంక్షన్ హాల్లో ఉమ్మడి జిల్లా పిఏసి సమావేశం నిర్వహించగా...జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యేలు డా. మైనంపల్లి రోహిత్, సంజీవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంత్ రావు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఆయా నియోజకవర్గం ఇంచార్జిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి, రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలతో పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడిన వారికి పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే 70 నుంచి 80 శాతం పదవులు సీనియర్, పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి ఇస్తున్నామని, 20 శాతం మాత్రమే స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన వారికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయి. ఓపిక పట్టండి ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట గా చెప్పారు. మంత్రి సీతక్క ఇదే విధానంలో పదవులు ఇచ్చారని, అంతటా ఆలాగే ఇస్తామని తెలిపారు. పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటున్నది తెలిసిందే.. కానీ పార్టీ హద్దులు దాటితే ఎంతటి వారిననైనా ఉపేక్షించేది లేదని, ఇందులో తనతో పాటు సీఎం, మంత్రులు కూడా ఉంటారని అన్నారు. మీడియాతో మాట్లాడే సమయంలో జాగ్రతగా మాట్లాడని హితవు పలికారు. పదేళ్ల దుర్మార్గపు పాలన ప్రజలు మరచిపోలేదు. హరీష్ రావు జిల్లాలో ఏదో ఒక విమర్శిస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. కానీ వారు పదేండ్లు ఏం చేశారని ప్రశ్నించారు. మీరు చేసిన దోపిడీ, భూకబ్జాలు ప్రజలకు ఇంకా గుర్తు ఉన్నాయన్నారు. ప్రజలు ఇంకా మరచిపోలేదని గుర్తు చేశారు. ఇక సోషల్ మీడియాలో అబద్దపు ప్రచారం చేయిస్తున్నారన్నారు. మీ ప్రభుత్వంలో 20 తేదీ వరకు ఉద్యోగులకు జీతాలు రాలే.. తాము ఒకటో తారీఖున జీతాలు ఇస్తున్నామన్నారు. మల్లన్న సాగర్ విషయంలో ఎంత మంది రైతులపై కేసులు పెట్టారని ప్రశ్నించారు. మోడీ ఎన్ని కోట్లు ఉద్యోగాలు ఇచ్చారో రఘునందన్ రావ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు మోడీ సర్కార్ తీసేస్తున్నారు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన కంపెనీలను ఆధాని, అంబానీలకు కట్టబెట్టారని ఆరోపించారు. దేశంలో ఉద్యమాలు ప్రారంభం అయ్యాయని, ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన మోడీని ఇంటికి పంపడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రతిపక్ష నాయకుని హోదాలో ఉన్న కెసిఆర్ అసెంబ్లీకి ఎందుకు రారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నామని, పేదవాడి కల ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నాం, తెలంగాణ రాష్ట్రంలో అర్హత గల పేదలు ఇల్లు లేకుండా ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ఇళ్ల నిర్మాణం చేసి ఇస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అన్ని దొంగ మాటలు, మార్ఫింగ్ వీడియోలను ప్రజలు నమ్మొద్దని కోరారు. కేటీఆర్ సోషల్ మీడియాను నమ్ముకున్నారని, రాయలసీమలో కత్తి పట్టినోడు కత్తితోనే పోతాడన్నట్లు కేటీఆర్ కూడా అదే సోషల్ మీడియాతో పోయాడని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇండ్లు అమ్ముకున్న మాటలు ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. పేదల పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, విద్య, వైద్యంపై తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి, అర్హులైన అందరి ఓట్లు ఉండేలా క్యాడర్ కష్టపడాలన్నారు. ఈ సమావేశంలో గాలి అనిల్ కుమార్, పూజల హరికృష్ణ, మెదక్, రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్లు రాధిక, లావణ్య, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, అశోక్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి

### త్వరలో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంబానికి చర్యలు
### మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆకస్మిక తనిఖీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. మెదక్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తో కలిసి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కబ్రా, డిఎంహెచ్ఓ డా. జ్ఞానేశ్వర్, డీసీహెచ్ఎస్ డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్షించారు.ఈ సమీక్షలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు పాల్గొన్నారు. హెచ్ఆర్ ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సేవలను అందుబాటులోకి తేవడంపై ఈనెల 25న హైదరాబాద్ సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశంకు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల బలోపేతంపై మంత్రి చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణంపై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై తెలుసుకున్నారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు.



## సీఎంసీ కమిషనర్ గారు.. వీటికెవరు బాధ్యులు?

### ప్రారంభం నుండే ఫిర్యాదులు అయినా పనులు పూర్తి




**ముద్ర, శేరిలింగంపల్లి:** గచ్చిబౌలి ఘటన జరిగాక స్పందించిన అధికారులు సమీప అనుమానాస్పద భవనాలను హైడ్రా సహకారంతో కూల్చివేస్తున్నారు. ఆ స్పందనలు కేవలం గచ్చిబౌలి అంజయ్య నగర్ కే పరిమితమా...మిగతా ప్రాంతాల్లో నిర్మించిన అక్రమ, నాణ్యత లేని భవనాలపై చర్యలుంటాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అంజయ్య నగర్ ఘటన ఇరువురి ప్రాణాలు తీసినప్పటికీ అనేక మంది బతికి బయటపడ్డట్టుగానే భావించాలి. ఇదే తరహా మాదాపూర్ లోని ఇజ్జత్ నగర్ సర్వే నెం.9లో అక్రమణంగా నిర్మించిన రెండు భవనాల విషయంలో సీఎంసీ అధికారులు ఇప్పటికే పలు నోటీసులు జారీ చేశారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు శాఖకు సైతం లేఖ రాసారు. 2026 సంవత్సరం జనవరిలో అక్రమ నిర్మాణం మొదలు పెట్టిన యజమానికి సీఎంసీ అధికారులు గత ఏడు నెలలుగా నోటీసులు ఇస్తూనే ఉన్నారు...పనులు జరుగుతూనే ఉన్నాయి....చివరకు నాలుగంతస్థు పూర్తి చేసి అద్దెకు సైతం ఇచ్చేసారు. చేసేది లేకనో...చేయలేకనో అధికారులు మాత్రం 'బుద్ధం శరణం గచ్ఛామి' అన్నట్టుగా వ్యవహరించారు. ఆరు నెలల నిర్మాణ సమయంలో డీసీ, ఎసీపీ, టీపీఎస్ నుండి చైన్ మేన్ వరకు అక్రమ నిర్మాణం జరుగుతున్న భవనం వద్దకు, మున్సిపల్ కార్యాలయానికి తిరుగుతూ ఠాగూర్ సినిమాను మరిపించారు. చివరకు తామేమి చేయలేమన్నట్టుగా పోలీసులకు లేఖ రాసి చేతులు దులుపుకున్నారు సీఎంసీ అధికారులు. బిజీగా ఉన్నాం...వీటి కంటె ప్రయారిటీ కేసులు చాలా ఉన్నాయంటూ పోలీసులు ఫైల్ పక్కన పడేసారు...ఫలితంగా ఇజ్జత్ నగర్ అక్రమ భవన నిర్మాణాల కథ కళకళలాడుతోంది. గచ్చిబౌలి ఘటన అనంతరం ఇటు సీఎంసీ అటు హైడ్రా అధికారులు గాండ్రిస్తూ గగ్గోలు పెడుతున్నారు. అంజయ్య నగర్ లో 45 గజాల స్థలంలో ఏడంతస్థుల అక్రమ భవన నిర్మాణంలో టీపీఎస్ ను సస్పెండ్ చేసిన అధికారులు సీఎంసీ కార్యాలయానికి సమీపంలోని ఇజ్జత్ నగర్ లో అక్రమంగా సుమారు 400 గజాల వేరు వేరు స్థలాల్లో వెలిసి నోటీసు అందుకుని క్రిమినల్ కేసులకు సైతం ఫిర్యాదు చేయబడ్డ యజమానిపైనా, భవనంపైనా ఏ మేరకు స్పందిస్తారు... ఏ స్థాయి అధికారులపై వంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

## గ్రేస్ మార్కుల సమస్యపై కవితకు వినతి

**ముద్ర, కూకట్‌పల్లి :** జెఎన్‌టియుహెచ్ R22 రెగ్యులేషన్ విద్యార్థులు ఎదుర్కొంటున్న గ్రేస్ మార్కుల సమస్యపై స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు టీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితను కలిసి వినతిపత్రం సమర్పించారు. కొద్దిపాటి మార్కుల తేడాతో వేలాది మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేయలేక ఉద్యోగ, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఎస్ పి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ నాయక్ వివరించారు. గ్రేస్ మార్కులను 0.15% నుండి 0.50% కు పెంచాలి. లేదా ఒక సబ్జెక్టుకు మినహాయింపుఇవ్వాలి లేదా ఒకసారి ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలి. యూనివర్సిటీ అధికారుల నుండి స్పందన రాకపోవడంతో ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, తొలి విచారణ కూడా పూర్తయిందని తెలిపారు. జెఎన్‌టియుహెచ్ వైస్ ఛాన్సలర్‌తో ఫోన్ లో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. న్యాయస్థానంపై నమ్మకం ఉంచామని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు శాంతియుత పోరాటం కొనసాగిస్తామని ఎస్ పి ఎఫ్ నాయకులు శ్రీహాస్, సాగర్, శ్రీనికేతన్ పేర్కొన్నారు.

## కేపీహెచ్‌బీలో ప్రభుత్వ భూముల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలి

### ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్



**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ భూముల వేలం విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఎంపీ ఈటల సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించినా లేదా లీజుకు ఇచ్చినా.. స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటు ధరల్లో గృహాలను అందించడం వంటి ప్రజా ప్రయోజన నిబంధనలను అమలు చేసేవని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అలాంటి నిబంధనలను పక్కనబెట్టి, కేవలం తక్షణ ఆర్థిక అవసరాల కోసమే భూములను విక్రయించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తరతరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను పార్కులు, క్రీడా మైదానాలు, సీనియర్ సిటిజన్స్ క్లబ్‌హౌస్‌లు వంటి ప్రజా అవసరాలకే కేటాయించాలని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు. ప్రభుత్వ భూములను ప్రజల ఆస్తిగా భావించి, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**ముద్ర, చేవెళ్ల :** పోతురాజుల విన్యాసాలు, శివాసత్తుల ఆటలు యువకుల కేరింటలతో సోమవారం పోచమ్మ బోనాల ఉత్సహం ఘనంగా నిర్వహించారు. శంకర్ పల్లి పురపాలిక పరిధిలో ని బీడీల్ కూడలిలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో సోమవారం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రదీఖానాలు చేసి నైవేద్యం సమర్పించారు. పోచమ్మ తల్లి చల్లంగా చూడాలి అంటు కోరుకున్నారు. గ్రామస్తులను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంద రెడ్డి, నిర్వాహకులు, నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, సత్తి రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్లను రెన్యూవల్ చేయాలి

### డిఆర్ డి ఓ నాగిరెడ్డికి వినతిపత్రం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో వికలాంగుల పెన్షన్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సదరం సర్టిఫికెట్ల రెన్యూవల్ గడువు ముగియడంతో, వారికి వెంటనే రెన్యూవల్ అవకాశం కల్పించాలని కోరుతూ భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, 18వ వార్డు కౌన్సిలర్ పాశం అమర్ సోమవారం డి ఆర్ డి ఓ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ దరఖాస్తుల కోసం సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండటంతో, ఇప్పటికే సర్టిఫికెట్ల రెన్యూవల్ తేదీ ముగిసిన అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ఈ నెల 31వ తేదీలోపు సదరం సర్టిఫికెట్ తో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెలలో తేదీలు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.పెన్షన్ దరఖాస్తులకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు కావడంతో, రెన్యూవల్ గడువు ముగిసిన వికలాంగులందరికీ ఈ నెలలోనే సదరం సర్టిఫికెట్ల రెన్యూవల్‌కు అవకాశం కల్పించి, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.వికలాంగుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులుగా అభిలాష్

### ప్రశాంతంగా నూతన కార్యవర్గం ఎన్నికలు






**ముద్ర ప్రతినిధి, మెదక్:**మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా ముగిసాయి. జిల్లా అధ్యక్షులుగా అంతొల్ల అభిలాష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా ఆర్ఎస్ఐ నరేష్, కోశాధికారిగా విజయ్, సంయుక్త కార్యదర్శిగా రాము, కార్యనిర్వాహణ కార్యదర్శిగా పి. సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సాజిద్ అలీ, సతీష్, విజయ్ కుమార్, గంగామణి, నర్సింలు, రేణుక,, కో ఆప్షన్ సభ్యులుగా ఆకుల గోపాల్, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## అత్యాధునిక శస్త్రచికిత్సతో రెండేళ్ల బాలికకు మూర్ఛల నుంచి విముక్తి




**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 24:** మందులతో నియంత్రణలోకి రాని తీవ్రమైన మూర్ఛవ్యాధితో బాధపడుతున్న భువనగిరికి చెందిన రెండేళ్ల బాలిక వాగ్దేవికి సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వైద్యులు అత్యాధునిక ఎపిలెప్సీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.ఆరు నెలల వయస్సు నుంచే బాలికకు ప్రతిరోజూ మూర్ఛలు వస్తుండగా, పలు మందులు వాడినా నియంత్రణలోకి రాలేదు. ఎంఆర్ఐ, పీఈటీ–సీటీ పరీక్షల ద్వారా ఎడమ టెంపోరల్ ప్రాంతంలోని అసాధారణ కణజాలం మూర్ఛలకు కారణమవుతున్నట్లు గుర్తించారు.సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఆర్. అయ్యదురై నేతృత్వంలోని వైద్య బృందం అంటీరియర్ టెంపోరల్ లోబెక్టమీతో పాటు అసాధారణ కణజాలాన్ని తొలగించింది. శస్త్రచికిత్స సమయంలో ఆధునిక న్యూరోమానిటరింగ్ పద్ధతులతో మెదడు కార్యకలాపాలను పర్యవేక్షించారు.శస్త్రచికిత్స అనంతరం బాలికకు మూర్ఛలు పూర్తిగా నిలిచిపోయాయని, EEGలోనూ అసాధారణ విద్యుత్ కార్యకలాపాలు కనిపించలేదని వైద్యులు తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడటంతో వారం రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు.

## ఒగ్గు కథకుడు తాండురు వాసి నరసింహకు కేంద్ర ప్రభుత్వ అవార్డు



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** . కేంద్ర సంస్కృతిగా మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా జానపద కళాలను కాపాడేందుకు కళా దీక్ష వంటి కార్యక్రమాల ద్వారా ఒగ్గు కళాకారులను ప్రోత్సహించడం చాలా మంచి పరిణామం అని వికారాబాద్ జిల్లా తాండూర్ వాసి ఒగ్గు కళాకారుడు కురుమ నరసింహ పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో సావిత్రి బాయ్ పూలె ఆడిటరియం లో ఒగ్గు కథకు జీవం పోస్తున్న కళారులను గుర్తించి ఆది గురువుమన ప్రధాన మంత్రి గౌరవ నరేంద్ర మోడీ గారు కేంద్ర ప్రభుత్వం వర్దల్ ఒగ్గు కథ 2025 అవార్డు లో తెలంగాణ రాష్ట్రంనుండి 25 మందిని సెలక్ట్ చేసిన వారిలో తాండూర్ ప్రాంతం నుండి నాకు ఒక్కడి అవార్డు రావడం చాలా సంతోషదాయకమని నరసింహ పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో బలగం సినిమా సుధాకర్ రెడ్డి మరియు హీరో విజయ్,గారి చేతులమీదుగా అవార్డు తీసుకోవడం వారు శాలువతో సన్మానించి నన్ను ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఒగ్గు కథ అవార్డు రావడానికి నన్ను ప్రోత్సహించిన గౌరవ కుమారస్వామిసార్ గారికిరాజ్ కుమార్ అన్న గారికి ఒగ్గు కళాకారుడు నరసింహ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రాఘవ కన్స్ట్రక్షన్ లో భవనం పై నుంచి పడి యువకుడు మృతి



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** రాఘవ కన్స్ట్రక్షన్ లో నిర్మాణం లో ఉన్న భవనం పై నుండి పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... నార్సింగి పరిధిలోని రాఘవ కన్స్ట్రక్షన్లో జగ్గిశెట్టి సాయి తేజ(25) తండ్రి పేరు జగ్గిశెట్టి సత్యం పనిచేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడినాడు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి తేజను మెడికవర్ హాస్పిటల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్టు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555